NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 98490

బరువైన ఆహార్యం

మాధురీ దీక్షిత్


అనుష్క శర్మ

తారల గురించి చెప్పుకోవాలంటే ఏదో ఒకటి కాదు........ కాస్త ప్రత్యేకమే అయివుండాలి. యాక్టింగ్, హెయిర్ స్టైల్, కాస్ట్యూమ్స్... విలక్షణంగా వుండే ప్రతి ఒక్కటీ చర్చనీయాంశమే. పాత్రను బట్టి ఆహార్యాన్నీ భారీ స్థాయిలో ధరించడం లేటెస్ట్ ట్రెండ్. భారీ బడ్జెట్ సినిమాలపై ఈ ట్రెండ్ ఎఫెక్ట్ ఎక్కువే. బరువైన దుస్తులు, నగలని ధరించే ఈ ఫ్యాషన్ కాస్త అటుఇటుగా శ్రీదేవితోనే మొదలయ్యిందని చెప్పాలి. తమిళ చిత్రం 'పులి' కోసం మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన 20 కేజీల బరువున్న దుస్తులని ధరించింది శ్రీదేవి. 'జోధా-అక్బర్' ... సినిమా సెట్లే కాదు తారల నగల విషయంలోనూ హుందాతనం ఎక్కడా తగ్గకుండా జాగ్రత్త పడ్డారు నిర్మాతలు. ఈ చిత్రంలో ఐష్ ధరించిన నగల బరువెంతో తెలిస్తే ఆశ్చర్యమేస్తుంది.... బంగారు నగలతోపాటు కెంపులు, వజ్రాలని పొదిగిన ఆ ఆభరణాల బరువు 200 కేజీలు. 'దేవదాస్' చిత్రంలో మాధురీ దిక్షిత్ నటనే కాదు తన కాస్ట్యూమ్స్ కూడా ప్రేక్షకులకి నచ్చేశాయి. ఆ సినిమాలో ఓ పాట కోసం 20 కేజీల బరువైన లెహంగాని ధరించింది మాధురీ దీక్షిత్. 'బాజీరావ్ మస్తానీ', ' రామ్‌లీలా' దీపికాకి మంచి పేరుతెచ్చిపెట్టిన చిత్రాలు. ఈ చిత్రాల కోసం తను ధరించిన 20 కేజీల దుస్తులతోపాటు ఆయుధాలు, నగల బరవు 15 కేజీలపైనేనట....అనుష్క శర్మ 'బాంబే వెల్వెట్' చిత్రంలో నీహారిక ఖాన్ డిజైన్ చేసిన 35 కేజీల గౌన్‌ని ధరిస్తే... 'కి అండ్ కా' చిత్రం కోసం 32 కేజీల బరువున్న లెహంగాని ధరించింది కరీనా.

శ్రీదేవి



ఐశ్వర్యరాయ్

దీపికా పదుకోన్

ఈ పరుగు వెనుక...

ఓ పెళ్లి రోజు. భార్య గర్భిణి. ఆమెకు ఓ గొప్ప సంతోషాన్ని బహుమతిగా ఇవ్వాలి. అందుకే షాలినీ సరస్వతిని భర్త ప్రశాంత్ కాంబోడియా పర్యటనకు తీసుకెళ్లాడు. అంతా బానే జరిగింది కానీ ఒక్కసారిగా షాలిని తీవ్ర అనారోగ్యం పాలైంది. ఓ అరుదైన బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సోకి దాదాపు మృత్యువు అంచుల్లోకి వెళ్లింది. కడుపులోని బిడ్డను పోగొట్టుకుంది. రెండు చేతులు, కాళ్లు కోల్పోయింది. ఇది జరిగి నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు షాలిని ఎలా ఉంది? ఓ విజేతగా మారింది. బ్లేడ్ రన్నర్‌గా మళ్లీ జీవితాన్ని పరుగులు పెట్టిస్తోంది.

షాలినీ సరస్వతిది బెంగుళూరు. ఆమె ఓ ఇంజినీరు. అటు వృత్తి జీవితం... ఇటు వైవాహిక జీవితం సజావుగా సాగిపోతోంది. ఆమె 34 ఏళ్లకు గర్భం దాల్చింది. అది పట్టలేనంత సంతోషం అయితే... అదే ఏడాది 2013లో వచ్చిన పెళ్లి రోజుకు అదో ప్రత్యేకం. అందుకే కాంబోడియా పర్యటనకు వెళ్లారు. తిరిగి వస్తుండగానే ఆమెకి చిన్నగా జ్వరం మొదలైంది. ఆ తర్వాతి రోజుల్లోనే పూర్తిగా ఆమెను నిస్తేజం చేసింది. వైద్యులు అనేక పరీక్షలు చేసినా ఆమె సమస్యేంటో అంతుబట్టలేదు. అప్పుడే ఏదో అరుదైన జబ్బుతో బాధపడుతోందని తెలుసుకుని కొత్త ప్రాంతం కావడంతో ఏదైనా బ్యాక్టీరియల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్ సోకిందని భావించి పరీక్షలు నిర్వహించారు. అందులో వారు అనుకున్నట్లే రిక్కెట్సియల్ ఇన్ఫెక్షన్ సోకింది. పర్వత, అరణ్య ప్రాంతాల్లో ఈ బ్యాక్టీరియా సోకే అవకాశం ఎక్కువ. కీటకాలు కుట్టడం వల్ల ఇది సంక్రమిస్తుంది. జ్వరంతో మొదలై క్రమంగా శరీరంలోని అవయవాలన్నీ దెబ్బతిని చివరకు పక్షవాతం బారినపడి మనిషి చనిపోయే అవకాశం ఉంటుంది. త్వరగా గుర్తించి చికిత్స తీసుకోకపోతే చేతులు, కాళ్లను ఇన్ఫెక్షన్ తినేస్తుంది. ఇలానే షాలినీ సరస్వతి కాళ్లు, చేతులు పోగొట్టుకుంది. తనకన్నా ముఖ్యమని భావించిన బిడ్డను కూడా కోల్పోవడంతో ఆమె నైరాశ్యంలోకి జారిపోయింది. చాలా రోజుల పాటు ఐసీయూలోనే ఉన్న షాలినీ ఆ తర్వాత ఇంటికి తిరిగి వచ్చినా కూడా ఆ విషయం నుంచి కోలుకోలేకపోయింది. ప్రతి చిన్న అవసరానికి ఇతరులపై ఆధారపడటం మానసికంగా కుంగదీసింది. కొన్ని నెలలపాటు షాలినీ తేరుకోలేకపోయింది. ఇదంతా ఒకేసారి జరగలేదు. తొలుత ఎడమ అరచేతిని వైద్యులు తొలగిస్తే.. గాంగ్రీన్ వల్ల ఆ తర్వాత కుడిచేయి దానికదే తొలగిపోయింది. కొన్ని వారాల తర్వాత కాళ్లకు కూడా గాంగ్రీన్ వచ్చి మోకాలి కింది వరకు కాళ్లను కోల్పోయింది. కాళ్లకు శస్త్ర చికిత్స చేసే రోజు కాలి గోళ్లకు నెయిల్ పాలిష్ వేయించుకుని వెళ్లిందంటే ఆమె మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

తిరిగి నిలబడింది

పూర్తిగా వీల్ చెయిర్‌కే మిగిలిపోయిన షాలినీ 2014లో ఓ తెగువైన నిర్ణయాన్ని తీసుకుంది. తనకు అన్నీ దూరం చేసిన పరిస్థితిని జయించాలనుకుంది. బ్లేడ్ రన్నర్‌గా మారాలని దృఢ సంకల్పం తీసుకుంది. అలా బ్లేడ్‌లను ధరించి తొలుత నిలబడటం నేర్చుకుంది. క్రమంగా నడక ఆ తర్వాత పరుగు అందుకుంది. సమాజం తనను ఎక్కడ తృణీకరిస్తుందోననే భావనే అంతకుముందు వెంటాడేది. కానీ తానో విజేతగా నిరూపించుకుంటే సమాజానికే స్ఫూర్తినివ్వగలననే విషయమే..! ఎంత కష్టంగా ఉన్నా కూడా ప్రాక్టీస్‌ను ఆపలేదు. చాలామంది శిక్షకుల వద్ద మెళకువలు నేర్చుకుంది. చివరకు బెంగుళూరులోని ఓ క్రీడా శిక్షణ సంస్థలో బి.పి.అయ్యప్ప అనే కోచ్ దగ్గర శిక్షణ తీసుకోవడం మొదలెట్టింది. అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా ఆమెకు శక్తి ఉండకపోయేది. బ్లేడ్‌ల మీద శరీరాన్ని బ్యాలెన్స్ చేయడం కష్టసాధ్యమయ్యేది. అయ్యప్ప ఈ విషయాల మీదే తొలుత దృష్టి పెట్టాడు. ఆ తర్వాత ప్రొస్తెటిక్ లెగ్స్‌ను శరీరంలో ఓ భాగంగా గుర్తించేలా మానసికంగా సన్నద్ధం చేశాడు. ఆమె అడుగు వేయడమే కష్టమనుకున్న సమయంలోనే ఆయన 10కె రన్‌లో ఆమె పాల్గొనేందుకు భారీ ప్రణాళికే వేసుకున్నాడు. ఉదయాన్నే గంటన్నరపాటు ప్రాక్టీస్‌కు వెళ్లేది. రెండేళ్ల వరకు మరింత కఠిన శిక్షణతో హాఫ్ మారథాన్‌లకు సమాయత్తమైంది. అలా గతేడాది బెంగుళూరులో జరిగిన 10 కి.మీ.ల పరుగులో పాల్గొంది. స్థానికంగానే కాదు ప్రపంచవ్యాప్తంగా జరిగే మారథాన్‌లలో పాల్గొనాలనేది ఆమె లక్ష్యం. అలా ఇప్పుడు ఆమెకు పరుగే జీవితమైపోయింది. పూర్తిగా పారా అథ్లెట్‌లా మారిపోయింది. ఏ మారథాన్‌లోనైనా షాలినీ కనిపిస్తే అందరి దృష్టి ఆమెపైనే ఉంటోంది. రెండు బ్లేడ్‌లతో, మొండి



చేతులతో ఈ అసాధ్యం ఎంత అద్భుతంగా పోరాడుతుందోనని ఉద్వేగానికి లోనవుతుంటారు. ఆమె పరుగు వెనుక కథేంటో తెలుసుకో వాలనుకుంటారు. ★

ఇండెక్స్

ప్రత్యేకం 3
మహిళా మెకానిక్

స్టార్........4
మిస్ పర్‌ఫెక్ట్

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
ఏకాగ్రత హెల్మెట్..!

తెలుసా............... 11
పచ్చని తీరంలో...

కవిత్వమ్...............14
ఆకలి ఉట్టి

కథ 15
కొత్తకోక

కొత్త పుస్తకాలు 18
అంబేద్కర్ జీవితంపై
మరో పుస్తకం

నా కళ్లతో...........20
ఉత్తరాన్ని చూశా!

రుచి.....................21
బేబీ కార్న్ ఫింగర్ చిప్స్

బాల నేస్తాలు.............23
చిన్నారి కోయిల

పద వికాసం........24

పులి ఆత్మకథ

అట్టమీది కథ...6

తెలుగువారి రక్త సంబంధం ఆపాత చిత్రం- 12

కంప్యూటర్ హ్యాకథాన్

బ్యాడ్మింటన్ ఆటకి రారాజుగా నిలిచిన చైనా నంబర్ వన్ ఆటగాడిపై రెండుసార్లు కిడాంబి గెలవడమే కాకుండా వరుసగా మూడేళ్లలో నాలుగు సూపర్ సిరీస్ నెగ్గడం ఆషామాషీ కాదు. ఇదే ఫామ్ అతడు కొనసాగిస్తూ ఒలింపిక్ స్వర్ణాన్ని దేశానికి అందించగలడని ఆశిద్దాం. బీహార్ గ్రామాలకి చెందిన కొందరు అమ్మాయిలు బాల్య వివాహాలకి వ్యతిరేకంగా సాగిస్తున్న ఉద్యమం అభినందనీయం. సినీ తార నందిత సమాచారం ఆసక్తిని కలిగించింది. కంప్యూటర్ ప్రోగ్రామ్స్‌లో అద్భుతాలు సృష్టిస్తున్న రవి సుహాగ్ పట్టుదల, సంకల్ప లక్ష్యయ యువతకు గొప్ప స్ఫూర్తి దాయకం.

-టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం.

మంచు నృత్యం

మంచులో గిరగిరా తిరుగుతూ వేగంగా చేసే ఐస్‌స్కేటింగ్ విన్యాసాల్లో బులెట్‌లా దూసుకుపోతున్న భారతీయ స్కేటర్ నిశ్చయ్ పరిచయం బాగుంది. కాలుష్యానికి చెక్ పెట్టేందుకు షెటల్ బస్సు ఆలోచన చేసిన ఢిల్లీ వాసులకి హ్యాట్స్ ఆఫ్.

మలయాళ నటి మంజిమ పరిచయం చదివించింది. ఈ వారం అట్టమీది కథ 'పుడమి దీపాలు' దేశవ్యాప్తంగా మహిళలు తమ ఉనికి కోసం చేస్తున్న పోరాటాలని తెలుసుకోగలిగాం. ఆపాత చిత్రం 'గుండమ్మ కథ', 'మా అమ్మ' కవిత, అప్పుడే తెల్లారింది కథ ఆకట్టుకున్నాయి. 'నేను చూసిన చైనా' చదివినంతసేపూ మేము చైనా పర్యటన చేసిన అనుభూతిని పొందాం. చినుకు తడిమితే, సైబీరియా ముఖచిత్రాలు అబ్బురపరిచాయి.

-విజయలక్ష్మి, అనంతపురం.

సైబీరియా ముఖచిత్రాలు

సైబీరియా ముఖ చిత్రాలు అబ్బుర పరిచాయి. దశాబ్దాలుగా మంచు ఎడారుల్లో నివసిస్తూ ఈ ప్రపంచానికి పరిచయం లేకుండా పోతున్న వారిని వెతికి పట్టుకోవడం నిజంగా ఓ సాహసమే. ఇలాంటి సాహసం చేస్తున్న అలెగ్జాండర్ ఖిముషిన్‌కి హ్యాట్స్ ఆఫ్. ఆపాత చిత్రం 'గుండమ్మ కథ', అప్పుడే తెల్లారింది కథ చదివించాయి. నికరాగువా కాంతి పుంజం, పచ్చటి వెలుగు. అట్టమీది కథ 'పుడమి దీపాలు ఆకట్టుకున్నాయి. మలయాళ తార మంజిమ పరిచయం బాగుంది. నవ్వుల్ పువ్వుల్ నవ్వుతెప్పించాయి.

-మంజూష, విజయనగరం.

ఢిల్లీ షటిల్

పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ షటిల్ చక్కని పరిష్కారం చూపింది. ఇలాంటి ఆలోచన అన్ని ప్రాంతాల్లో అమలయితే పర్యావరణం మెరుగవుతుంది. ప్రపంచ అజ్ఞానపు తిమిరాల్ని జ్వలించేస్తున్న నేటి పుడమి దీపాల పరిచయం ఆకట్టుకుంది. నవ్వుల్ పువ్వుల్ నవ్వుతెప్పించాయి. 'ఇంటి మీద రోడ్డు', 'కాకులు చదువుతాయా', జన ఘనం, కవితలు, చినుకు తడిమిన చిత్రాలు బాగున్నాయి.

-అన్వేష్, విజయవాడ.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com



కుల దురహంకార హత్యలు, మహిళలపై హింస, భ్రూణహత్యలు, లింగ వివక్ష, లాంటివి తీవ్రస్థాయిలో నమోదయ్యే రాష్ట్రాల్లో హర్యానా ఒకటి. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు ఎక్కువగా చోటుచేసుకునే ఈ రాష్ట్రంలో అమ్మాయిల భద్రత అంతంత మాత్రమే అనేది ఓ నివేదిక...... అలాంటి హర్యానాలోని ఓ మారుమూల గ్రామంలో మెకానిక్ వృత్తిలో కొనసాగుతోంది ఓ మహిళ. ప్రస్తుతం అక్కడ ఎంతో మంది ఆడపిల్లలకి ఆదర్శంగా మారిన ముఖేష్ దేవి గురించి మీరూ చదివి తెలుసుకోండి.

మహిళా మెకానిక్

హర్యానాలోని ఓ ప్రధాన పట్టణం రోహతక్. రాష్ట్ర రాజధాని చండీగఢ్ నుండి 45 కి.మీ ప్రయాణంలో వుందీ పట్టణం. పేరుకి పట్టణమే అయినా ఇక్కడ ఆచార వ్యవహారాలు మాత్రం అనాగరికంగానే కనిపిస్తాయి. బాల్యవివాహాలు, భ్రూణహత్యల్లో ఈ ప్రాంతం ఇప్పటికీ మొదటి స్థానంలోనే వుంది. ఇక్కడ ఆడపిల్లల అక్షరాస్యత కూడా అంతంత మాత్రమే. దీనికితోడు ఆకతాయిల వేధింపులకి భయపడి సాయంత్రాల్లో మహిళలు ఇంటి నుండి బయటికి అడుగుపెట్టేందుకు భయపడుతుంటారు. ఇలాంటి సామాజిక పరిస్థితుల మధ్య ఒంటరిగా మెకానిక్ షాపుని నడుపుతోంది ముఖేష్ దేవి. నిజానికి దేవి మెకానిక్ వృత్తిని ఎంచుకోడానికి కుటుంబ అవసరాలే కారణమైనా ఇప్పుడు అక్కడ అమ్మాయిలకి ఆదర్శంగా నిలిచింది ఆమె. రోహతక్‌లోని ఓ కూడలిలో మెకానిక్ షాప్‌ని నిర్వహించేవాడు ముఖేష్ దేవీ భర్త. కొన్నాళ్ళ క్రితం ఆనారోగ్యంతో తను పూర్తిగా మంచానపడడంతో కుంటుంబ భారాన్ని మీదేసుకుంది దేవి. చిన్న చిన్న పనుల్లో కొనసాగినా తను సంపాదించే డబ్బు కుంటుంబ అవసరాలకి ఏ మాత్రం సరిపోయేవి కాదు. వేరొకరి వద్ద తక్కువ జీతానికి పనిచేసే కంటే తన భర్త నిర్వహించిన మెకానిక్ షాప్‌నే తిరిగి మొదలు పెట్టాలనే అలోచన వచ్చింది తనకి. అయితే ఆడవారికి భద్రత తక్కువగా వుండే ఆ ప్రాంతంలో మెకానిక్‌గా వృత్తిలో కొనసాగటం అంతమంచిది కాదంటూ చుట్టుపక్కల వారంతా హెచ్చరించారు. బైక్ రిపేరింగ్ చేయడం కష్టమంటూ భయపెట్టారు. మగవారితో సమానంగా పనిచేస్తూ ఎంతో మంది మహిళలు అన్ని వృత్తుల్లో ముందడుగేస్తున్న ఘటనల గురించి తనకి తెలుసు. కానీ మెకానిక్ వృత్తిలో కొనసాగేందుకు చాలామంది అమ్మాయిలు వెనుకడుగేస్తున్నారు. ఇలాంటి వృత్తిలో కూడా మహిళ రాణించగలదనేది దేవి అభిప్రాయం.

ఆ అబిప్రాయాన్ని బలపరుస్తూ స్టీరియోటైప్ ఆలోచనలని పక్కన పెట్టి మెకానిక్‌గా మారాలని నిర్ణయించుకుంది ముఖేష్ దేవి. అలా కొన్ని రోజుల్లోనే తన ఆలోచన కార్యరూపం దాల్చింది. తొలినాళ్ళలో వాహనాలకి పంక్చర్ వేయడం, టైర్ మార్చడం లాంటి పనులు చేస్తున్న ముఖేష్ దేవిని అందరూ వింతగా చూసేవారు. మరికొందరు అవమానంగా తలదించుకుని వెళ్ళిపోయేవారు. ఓ రోజు తన షాప్‌లో బండి టైర్ మారుస్తున్న ముఖేష్ దేవిని చూసిన ఒక పెద్దాయన తనని పలకరించాడు. తన సొంత వాహనానికి టైర్‌ని మారుస్తోందనుకున్నాడా పెద్దాయన. ఆమె వంక కాస్త వింతగా చూస్తూ ఇలాంటి పనులు ఆడవారికి కష్టం కదా... ఇదెక్కడ నేర్చుకున్నావంటూ ప్రశ్నించాడు. దానికి దేవి నవ్వుతూ ఇది నా వృత్తి అంటూ సమాధానం ఇచ్చింది. ఊహించని ఆ సమాధానానికి ఆయన ఆశ్చర్యపోయాడు. బదులుగా ఆమెని అభినందించి వెళ్ళిపోయాడు. ఇలాంటి అభినందనలే కాదు కొన్ని సందర్భాల్లో తనకి అవమానాలూ ఎదురయ్యాయి. తొలినాళ్ళలో అమ్మాయి మెకానిక్‌గా పనిచేస్తోంది చూడండంటూ వాహన దారులు తన షాప్ వద్ద ఆగి వింతగా చూస్తుండడం, వెటకారంగా మాట్లాడడం లాంటివి తనని భాధపెట్టాయి. అలాంటి వాటిని ధైర్యంగా తిప్పికొట్టడం అలవాటుచేసుకుంది. ఇప్పుడు తన పనితనం గురించి తెలిసి తనని అందరూ ఆప్యాయంగా పలకరిస్తుంటారు. రిపేరింగ్ పనులు అప్పగిస్తున్నారు. ఇంటి పనితోపాటు కుటుంబ భారాన్నీ మోస్తున్న ఈ మెకానిక్ మహిళని ఇప్పుడు అక్కడ గౌరవించేవారే ఎక్కువ. అవనిలో సగం ఆకాశంలో సగం అనే నినాదానికి నిజమైన ఉదాహరహరణ ముఖేశ్ దేవి... అవమానాలనే అవకాశాలుగా మార్చుకుంటూ జీవితంలో ముందుకు సాగుతున్న ముఖేష్ దేవి స్థానికంగా నిర్వహించే కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఆహ్వానించబడుతోంది. తన ప్రసంగాల ద్వారా అమ్మాయిల్లో ధైర్యాన్ని నూరిపోస్తున్న దేవి రోహతక్ ప్రాంతంలో అమ్మాయిలకి ఒక రోల్ మోడల్‌గా మారిపోయింది.

- శర్వాణి

తాప్సీ ఇప్పుడు చాలా స్ట్రాంగ్‌గా కనిపిస్తోంది. అటు చిత్రాల్లో ఎంచుకునే పాత్రల ద్వారా... అభిప్రాయాల్ని నిక్కచ్చిగా చెప్పే తెగువ ద్వారా. దక్షిణాదిన బాగా పాపులరై మంచి స్థానంలోకి వస్తున్న తరుణంలోనే ఆమె ఒక్కసారిగా బాలీవుడ్ వైపు కెరీర్‌ను మలుపు తిప్పింది. ఇలా చేయాలన్నా చాలా స్ట్రాంగ్‌గా ఉండాలి. పెద్ద నిర్మాతలు, గొప్ప దర్శకులు, మేటి తారలతో చిత్రాలు వస్తున్న తరుణంలో మళ్లీ దక్షిణాదిన తళుక్కుమనడానికి స్ట్రాంగ్‌గానే ఉండాలి. ఇదంతా తాప్సీకి ఎలా సాధ్యమైందంటే ఆమె మిస్ పర్‌ఫెక్ట్. చదువులోను, శాస్త్రీయ నృత్యంలోను, ఆటల్లోను, మెథడిస్ట్ నటనలోను. ఆ స్టార్ విశేషాలే ఈ వారం...

మిస్ పర్‌ఫెక్ట్

పంజాబీ జాట్ సిఖ్ కుటుంబానికి చెందిన తాప్సీ పెరిగింది ఢిల్లీలో. అక్కడే చదువు. ఐపీ విశ్వవిద్యాలయంలో ఆమె కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తిచేసింది.

- ఢిల్లీలో పెరిగిన తాప్సీ ముద్దు పేరు మ్యాగీ. నాలుగో తరగతి చదువుతున్నపుడే కథక్ నేర్చుకోవడం మొదలెట్టింది. పాఠశాల, కళాశాల పోటీల్లో ఎన్నో బహుమతులు గెలుచుకుంది.
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసిన తాప్సీ విద్యార్థిగా ఉండగానే ఓ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఐఫోన్‌కు పనికివచ్చే 'ఫాంట్‌స్వాప్' యాప్ అది. కానీ కంప్యూటర్ ముందు కూర్చుని ఎక్కువ రోజులు పనిచేయడం అస్సలు నచ్చలేదు.
- ఎంబీయే చేసి అదే వృత్తిలో కొనసాగాలనుకున్న తాప్సీ యాదృచ్ఛికంగా మోడలింగ్‌లోకి వచ్చింది.
- మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన తర్వాత ఓ చానెల్ రియాల్టీ కార్యక్రమంలో పాల్గొని తొలిసారి ఇండస్ట్రీ లుక్‌లో పడింది.
- పలు యాడ్‌ల్లో నటించడంతో తమిళ్ చిత్రం 'ఆడుకాలమ్'లో ధనుష్‌తో కలిసి నటించే అవకాశం వచ్చింది. ఇదంతా కూడా క్యాట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సమయంలోనే జరిగింది.
- 'ఝుమ్మంది నాదం'తో తెలుగు చిత్రసీమలోకి వచ్చింది తాప్సీ. 'మిస్టర్ పర్‌ఫెక్ట్'లోని నటనతో అందర్నీ ఆకట్టుకుంది. 'మొగుడు', 'గుండెల్లో గోదారి', 'కాంచన-2', 'ఘాజీ' వంటి చిత్రాల్లో విభిన్న పాత్రల్లో నటించింది.
- తాప్సీ ఎంత బిజీ అయిపోయిందంటే ఒక్క 2011లో దక్షిణాదిన 7 చిత్రాలు విడుదలయ్యాయి.
- 2013లో హిందీ చిత్రం 'చస్మే బద్దూర్' ద్వారా ఆమె హీరోయిన్‌గా పరిచయమైంది. దాదాపు పది చిత్రాలకు పైగా దక్షిణాది చిత్రాలు చేశాక తిరిగి బాలీవుడ్‌కు వెళ్లింది.
- బాలీవుడ్‌నే కాక అన్ని చిత్ర పరిశ్రమల్ని ఆకట్టుకున్న పాత్ర 'బేబీ' (2015) చిత్రంలో టాస్క్‌ఫోర్స్ ఏజెంట్ పాత్ర. తాప్సీ నటన ఆ పాత్రకు ప్రాణం పోసింది.
- అమితాబ్ బచ్చన్ ఉన్నా 'పింక్' చిత్రంలో తాప్సీదే ప్రధాన పాత్ర. మహిళల సమస్యల చుట్టూ కథ నడిచే ఆ చిత్రం దేశాన్ని కదిలించింది. 'నామ్ షబానా'లోని పాత్ర కూడా ఓ ఇంటెన్స్ కేరక్టరే.
- ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు 'ది వెడ్డింగ్ ఫ్యాక్టరీ' అనే ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థకు భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

- భరతనాట్యం, కథక్‌లో ప్రొఫెషనల్ అయిన తాప్సీ క్రీడల్లోను ప్రతిభావంతురాలే. ఆమె స్క్వాష్‌ను బాగా ఆడుతుంది.
- హిందీ, ఇంగ్లిష్‌లే కాక మరో మూడు భాషల్ని అనర్గళంగా మాట్లాడుతుంది.
- ఆమెకు కార్టూన్ చిత్రాలు అంటే చాలా ఇష్టం. అందులో తనకు బాగా నచ్చిన షో 'పవర్‌పఫ్ గాళ్స్'. అమ్మాయిలు సూపర్ హీరోలుగా మారి ప్రపంచాన్ని కాపాడుతుంటారు.
- తాప్సీ చాలావరకు తన స్టంట్‌లను తానే చేస్తుంది. ఈ మధ్య విడుదలైన యాక్షన్ ప్యాక్డ్ చిత్రాల్లో డ్యూప్ లేకుండా ఆమె స్టంట్‌ల్ని సొంతగా చేసి అందర్నీ ఆశ్చర్యపరిచింది.
- 'ఆనందో బ్రహ్మ' తెలుగు చిత్రం ద్వారా మరోసారి ఇక్కడి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. నానా పటేకర్‌తో కలసి నటించిన 'తడ్కా' కూడా త్వరలో రాబోతోంది.
- అలాగే హిందీలో 'జుద్వా-2' పాత చిత్రంలోని కరిష్మా కపూర్ శైలి పాత్ర, అభినయ్ డియో చిత్రంలో లాయర్ పాత్రల్ని చేస్తోంది.
- అలాగే శివ్ అరూర్ పుస్తకం 'ఆపరేషన్ జిన్నా'ను సినిమాగా తీయబోతున్నారని అందులో తాప్సీ ఓ పాత్ర చేస్తోందని సమాచారం.
- ఏ విషయాన్నైనా నిక్కచ్చిగా మాట్లాడుతుందనే పేరుంది తాప్సీకి. అలా ఈ మధ్యే తెలుగు సినిమాల్లోని కొన్ని రొమాన్స్ సన్నివేశాలు, పాటల గురించి తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టింది. నేరుగా ప్రముఖ దర్శకుని ప్రస్తావనే తేవడంతో విమర్శలు వచ్చినా కూడా ఆమె సరిగ్గానే మాట్లాడిందని చాలామంది మెచ్చుకున్నారు. ✦

నవ్వుల్ - పువ్వుల్

రెక్కల పంపకం

రామయ్య : అదేంటి ఫ్యానుకుండాల్సిన మూడు రెక్కల్లో ఒక్కటే వుంది....?
కనకయ్య : ఆస్తి పంపకాల్లో
నా కొడుకులిద్దరూ చెరోటీ పట్టుకు పోయార్లేరా!

గప్‌చుప్

చింటు : బంటీ! ఎందుకలా ఆ చీమని అగ్గిపెట్టెలో బంధిస్తున్నావ్....
బంటి : ఇది నేను దాచిపెట్టిన చాక్లెట్‌ని చూసేసింది. మిగిలిన వాటికి చెప్పకుండా వుంటుందా.... అందుకే దీన్ని నేను దాచేశా....!!
చింటు : ఆ....

ఇష్టం

తండ్రి : చింటూ! నీకు స్కూల్లో ఎవరంటే బాగా ఇష్టం??
చింటు : వాచ్‌మెన్ అంటే??
తండ్రి : అదేంటి.....
చింటు : ఇంటి బెల్లు కొట్టి ఇంటికి పంపించేది ఆయనే కదా.....!

అతితెలివి



టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయటం తెలివైన వారి లక్షణం అర్థమైందా!
శ్రీను : అర్థమైంది టీచర్ రేపటి హోమ్ వర్క్ రేపే చేయాలి. ఈ రోజు చేయకూడదని.

జ్ఞాపకాలు

బబ్లు : ఈ వాట్సప్ గ్రూప్‌లో మళ్ళీ మన చిన్ననాటి రోజులు గుర్తొస్తున్నాయి కదా...
గౌతమ్ : అవున్రా.....మన టీచర్‌ని కూడా యాడ్ చేస్తే మళ్ళీ వచ్చి హోమ్‌వర్క్ ఇస్తాడేమోనని భయంగా వుంది. ...
బబ్లు : అలాంటి పనులు ఇప్పుడెందుకు చేస్తాం!!!

సమయ స్ఫూర్తి

టీచర్ : రవీ! నేనింకా రెడీ చెప్పకుండానే నువ్వలా పరిగెత్తా వేంటి??
రవి : ఏ పనిలో అయినా ముందుండాలని నిన్న మీరేగా చెప్పారు ...
టీచర్ : ఆ......

కిసుక్కు సిత్రం



ముసురుకి సానా బద్ధకమేత్తాందే..!



నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్ : గుండుజ్ అగాయేవ్

సేకర్త: పి.బాలు, మచిలీపట్నం

పులి ఆత్మకథ



దట్టమైన కీకారణ్యం... చిన్నా పెద్దా నీటి మడుగులు... రకరకాల జంతువులు... పక్షుల కిలకిలరావాలతో అలరారే పచ్చ పచ్చని తరువులు నా సామ్రాజ్యం. అక్కడ నేను మకుటంలేని మహారాజుని. నేను ఠీవిగా నడిచొస్తుంటే ఆమడ దూరంలో ఒక్క పిట్టా కనబడేది కాదు. ఇక నేను వికటాట్టహాసం చేస్తే ఎవరికైనా చలీజ్వరం రావాల్సిందే. నా గాండ్రింపు రెండు కిలోమీటర్ల వరకూ వినిపిస్తుంది. రాచఠీవికి, గాంభీర్యానికి ప్రతీక నేను. అప్రమత్తతకు, తెగువకు సంకేతం నేను. భీతిగొలిపే స్ఫురద్రూపానికి, తిరుగులేని శక్తికి, లక్ష్యంపైకి విజృంభించి వేటాడే పట్టుదలకు చెరగని చిరునామా నేను. రాజసం ఉట్టిపడే నడక నా సొంతం. ఇప్పటికే నేనెవరో మీకు అర్థమై వుంటుంది. నా గురించి అంతో కొంతో తెలిసే ఉంటుంది. కానీ మీకు చాలా విషయాలు నా గురించి సరిగ్గా తెలీవు. నా గురించి మరికొంత మీకు తెలియాలి. అందుకే ఈ ఆత్మకథ.

- రాజాబాబు కంచర్ల

9490099231

నా పేరు 'రాయల్ బెంగాల్ టైగర్'. అంతా నన్ను ముద్దుగా పెద్ద పులి అంటారు. దేశానికి జాతీయ పతాకమల్లే... నేను మన జాతీయ జంతువును. అది తలచుకుంటే నా రాజదర్పం ఆకాశమంత పెరిగినట్టనిపిస్తుంది. అప్పుడు నా అడుగులు మరింత బలంగా పడతాయి. నీటిలో ఈదులాడటమంటే చాలా సరదా. ఒక్కోసారి నదులు, చెరువుల్లో గంటలకొద్దీ ఈతకొడతాను. ఇంకా చెప్పాలంటే... మీ మనుషులకంటే స్వల్పకాలిక జ్ఞాపకశక్తి మాకే ముప్పయి రెట్లు ఎక్కువ. మేము పూర్తి తెల్లగా లేత రంగు చారలతో, బంగారు రంగులో, పూర్తి నలుపు రంగులో, నీలి రంగులో కూడా వుంటాము. మీకు ఇంకో సీక్రెట్ చెప్పనా... అడవిలో మా సరిహద్దులను మేమే ఏర్పాటు చేసుకుంటాం. ఈ సరిహద్దులను గుర్తించడానికి ఎంపిక చేసుకున్న ప్రదేశంలో మూత్రవిసర్జన చేస్తాం. ఇక ఆ సరిహద్దుల నడుమ వున్న ప్రాంతమంతా నా సామ్రాజ్యమే. ఆ సరిహద్దులు దాటి ఏ ఇతర జంతువులు ప్రవేశించినా వాటికి మరణ శాసనమే. నేను సుమారు 11 అడుగుల పొడవు, 300 కిలోల బరువు వుంటా. 5 మీటర్ల దూరం వరకు దూకగలను. గంటకు 65 కి.మీ. వేగంతో పరుగెత్తగలను. మీరు గమనించారో లేదో... మా జాతిలోని ఏ పులి ఒంటి మీదనయినా దాదాపుగా 100 చారలు ఉంటాయి. ఏ రెండు పులుల ఒంటి మీది చారలూ ఒకేలా ఉండవని మీరు తెలుసుకోవాలి. నాకు కాస్త కోపం కూడా ఎక్కువే. ఒక్కసారి పంజా విసిరానంటే... మనిషి పుర్రె చెక్కలవ్వాల్సిందే.

మాలా బతకడంలే..

ప్రపంచంలో మా పులుల సంఖ్య అంతరించిపోయే దశకు చేరుకోవడంతో కళ్లుతెరిచిన అంతర్జాతీయ సంస్థలు పులుల సంరక్షణపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో 2010 నవంబర్ 24న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో మొట్టమొదటి పులుల సదస్సును నిర్వహించాయి. 'జూలై 29న అంతర్జాతీయ పులుల దినం'గా పాటించాలని ఆ సదస్సు తీర్మానించింది. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యంగా మేము విస్తరించి ఉన్న దేశాలన్నింటిలోనూ అంతర్జాతీయ పులుల దినాన్ని పాటిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా టర్కీ నుంచి రష్యా తూర్పు తీరం వరకు మా రాజ్యం విస్తరించి ఉండేది. గడచిన వందేళ్లలో మా ఆవాసంలో 93 శాతం విస్తీర్ణాన్ని కోల్పోయాం. మా సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అడవుల నరికివేత వల్ల, వేటగాళ్ల వల్ల మా సంఖ్య దాదాపు 97 శాతం మేరకు పడిపోయింది. దీంతో మా జాతి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. రాబోయే తరాల వారు మమ్మల్ని జూలోనే చూడాలేమో. ఆ విషయం తలచుకుంటేనే బాధగా వుంది. నాగరిక సమాజం మా పులుల పాలిట శాపంగా మారుతోంది. ఆ విషయం నేనేదో ఊహించి చెప్పడంలేదు. శాస్త్రీయ అధ్యయనాలు, గణాంకాలను మీరూ ఓసారి చూస్తే ఎన్నో చేదు నిజాలు వెల్లడవుతాయి. ఏ అడవిలో పెద్ద పులి ఉంటుందో ఆ అడవిలో పర్యావరణ సమతుల్యం పరిఢవిల్లుతుంది. మాకో నీతి వుంది. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టుపక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్‌లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ఆ ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం

ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి అయ్యి ఉండాలి. ఇదీ మా రాజసం. అయితే... 1913 నాటి లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సుమారు లక్ష మా సంఖ్య. 2010 నాటికి ఆ సంఖ్య కాస్తా 3,200కు పడిపోయింది. తాజా లెక్కల ప్రకారం మా సంఖ్య 3,890కి చేరుకుంది. గుడ్డి కంటే మెల్ల నయమన్నట్లుగా కాస్త ఉపశమనం. మీకింకో షాకింగ్ న్యూస్ చెప్పనా... వందేళ్లలో మా పులుల సంఖ్యలో తొలిసారిగా నమోదైన పెరుగుదల ఇది. అయితే శాస్త్రీయంగా గణాంకాల నిగ్గు తేల్చింది లేనిది తెలీదు. అంతకు ముందు మా సంఖ్య అంతా లెక్కగట్టగలిగారా లేదా? ఇప్పటి లెక్కల కన్నా అప్పుడే ఎక్కువున్నాయా? అనే సందేహాలు ఉన్నాయి. ఇదే గనుక నిజమైతే సంతోషించాల్సింది ఏమీ లేదు. ఒకవేళ నిజంగానే మా సంఖ్య పెరిగి ఇకపై కూడా ఇదే పరిస్థితి కొనసాగితే... భారత్, నేపాల్, భూటాన్, రష్యాలలో కూడా మా సంఖ్య బాగానే పెరిగే అవకాశం వుంది.

వందేళ్లలో మొదటిసారి

ప్రపంచవ్యాప్తంగా గడిచిన వందేళ్లలో మొదటిసారిగా పులుల సంఖ్య పెరిగినట్టు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. పులుల అక్రమ రవాణాను అడ్డుకుని, సంరక్షణ చర్యలు చేపడుతున్నందు వల్లే పులుల సంఖ్యలో ఈ పెరుగుదల నమోదైనట్టు తెలుస్తోంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) ప్రపంచ వ్యాప్తంగా పులుల సంఖ్య 3,890 ఉన్నట్టు ప్రకటించింది. 2010లో 3,200గా ఉన్న పులుల సంఖ్య నమోదైంది. అంటే దాదాపు 700 పులుల సంఖ్య పెరిగినట్టు ఐయూసీఎన్ తెలిపింది. ఆసియా మొత్తంలో ఉన్న పులులను వీరు లెక్కించారు. భారతదేశంలో 2,226, రష్యా, సైబీరియా-433, 371, ఇండోనేషియా-371, మలేషియా-250, నేపాల్-198, థాయిలాండ్-189, బంగ్లాదేశ్-106, భూటాన్-103, చైనా-7, వియత్నాం-5, లావోస్-2, కంబోడియా-1గా ఉంటే, మయన్మార్‌లో పులుల సంఖ్య శూన్యం. వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) మేనేజర్ డారెన్ గ్రోవర్ 20వ శతాబ్దంలో పులుల సంఖ్య పెరగడం ఇదే మొదటిసారని సంతోషం వ్యక్తం చేశారు. పులుల పెరుగుదల ఇలాగే కొనసాగితే 2022 నాటికి పులుల సంఖ్య 6400కు చేరుకుంటుందని గ్రోవర్ తెలిపారు.

మా తాత ముత్తాతలు

జంతులోకంలో పులులు, పిల్లులదీ ఒకటే జాతి. అందుకే మమ్మల్ని 'బిగ్ క్యాట్' అంటారు. స్థూలంగా మేము 'ఫెలైన్' జాతికి చెందినవారము. మేము మాంసాహార జంతువులమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదనుకుంటా. 'ఫెలైన్' జాతిలో 41 రకాల ఉపజాతులు ఉన్నాయి. ఇవన్నీ సుదీర్ఘ గతానికి చెందిన ఒకే జంతువు నుంచి పరిణామం చెందాయి. వీటిలో రెండు ప్రధాన వర్గాలు ఉన్నాయి. వీటిలో భారీగా ఉండి, అడవుల్లో సంచరించే అన్ని రకాల పులులు, చిరుతలు, సింహాలను 'పాంథరీన్' అంటారు. మిగిలిన రకాల పిల్లులను 'ఫెలినే' అంటారు. 'ఫెలైన్' జాతిలోని జంతువుల్లో మా పులుల జాతే పెద్దగా ఉంటుంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది జాతుల పులులు ఉండేవి. వాటిలో మూడు జాతుల పులులు పూర్తిగా అంతరించిపోయాయి. ప్రస్తుతం కేవలం ఆరు జాతుల పులులు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. వాటిలో రాయల్ బెంగాల్ టైగర్, ఇండో-చైనీస్ టైగర్, మలయన్ టైగర్, సైబీరియన్ టైగర్, సౌత్ చైనా టైగర్, సుమత్రన్ టైగర్. కాగా... బాలీ టైగర్, కాస్పియన్ టైగర్, జావన్ టైగర్ అంతరించి పోయాయి. సైబీరియన్ పులిని ఉత్తర చైనా పులి అని, మంచూరియన్ పులి అని, అమూర్ అని కొరియన్ పులి అని కూడా పిలుస్తారు. ఇది పులి జాతిలో ఒక అరుదైన జంతువు. దూర ప్రాచ్యం ప్రాంతంలో అమూర్ నది ప్రాంతంలో మాత్రమే ఉంటుంది. ఇది ప్రస్తుతం రక్షిత వన్యప్రాణి. ఇది పులి ఉపజాతిలో ఫెలినే కుటుంబంలో అతి పెద్దదైన జంతువు. ఇది సాధారణంగా మనుషులను తినడానికి అలవాటు పడదు. మగ సింహానికి, ఆడ పులికి పుట్టిన వాటిని 'లైగర్' అంటారు. మగపులికి, ఆడ సింహానికి పుట్టిన వాటిని 'టైగన్' అంటారు. మా శాస్త్రీయనామం పాంథేరా టైగ్రిస్. టైగర్ అనే పదం గ్రీకు భాషలోని టైగ్రిస్ నుండి వచ్చింది. దాని అర్థం బాణం. పాంథేరా అంటే పసుపు జంతువు అని అర్థం. ఇది ఫెలిడే కుటుంబానికి చెందినది. పాంథేరా తరగతికి చెందిన నాలుగు 'పెద్ద పిల్లులలో' ఇదొకటి.

మా జీవితమిదీ

జీవిత కాలంలో ఒక ఆడపులి సుమారుగా సమాన సంఖ్యలో ఆడ, మగ కూనలకు జన్మనిస్తుంది. వాటికి మూడున్నర నెలల వయసు వచ్చేంత వరకు తల్లిపులి వాటిని తన స్థావరంలో ఉంచి కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. ఆ తర్వాత తల్లి వద్దనే వేట మెళుకువలూ

జాతీయ జంతువుగా



1972 నవంబర్ 18 నాకెంతో ప్రతిష్టాత్మకమైన రోజు. భారత జాతీయ జంతువుగా నాకు ఓ ప్రతిష్టను కట్టబెట్టిన రోజు. భారతదేశంతో పాటు బంగ్లాదేశ్‌కి కూడా జాతీయ జంతువుగా మమ్మల్నే ఎంచుకోవడం మాకు మరింత గర్వకారణం. మన దేశంలో రాయల్ బెంగాల్ టైగర్ ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన జాతి. సైంటిస్టులు రాణా టైగర్‌గా వ్యవహరిస్తారు. అందుకే మన ప్రభుత్వం నన్ను జాతీయ జంతువుగా ప్రకటించింది. అయితే ఇప్పటివరకూ జాతీయ జంతువుగా వున్న నన్ను కాదని వేరొక జంతువును ఆ స్థానంలో కూర్చోబెట్టాలని కొందరు ప్రయత్నించడం దురదృష్టకరం.

నేర్చుకుంటాము. ఏడాదిన్నర వయసు వచ్చేసరికి సొంతంగా వేటాడే స్థితికి చేరుకుంటాం. అయితే, రెండున్నరేళ్లు వచ్చేంత వరకు తల్లి వద్ద పెరిగే మేము... ఆ తర్వాత తల్లిని విడిచిపెట్టేస్తాము. ఆడ పులులు మూడున్నర నుంచి నాలుగేళ్ల వయసులోను, మగ పులులు ఐదు నుంచి ఆరేళ్ల వయసులోను పునరుత్పత్తి సామర్థ్యాన్ని సంతరించుకుంటాయి. మా ఆయుర్దాయం గరిష్టంగా 26 ఏళ్ల వరకు ఉంటుంది. అయితే... వేటగాళ్ల బారిన పడటం, ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు వంటి కారణాల వల్ల మా సగటు ఆయుర్దాయం పదేళ్లకే పరిమితమవుతోంది. తగిన రక్షణ చర్యలు తీసుకుంటే మా ఆయుర్దాయం మరింత పెరిగే అవకాశం వుంది.

మా మెనూ

ఇక నాకు ఇష్టమైన ఆహారమేదో మీకు తెలుసుగా... నాన్ వెజ్జే. సాంబార్, గౌర్, జింక, అడవి పంది, నిల్గై, నీటి గేదె, పెంపుడు గేదెలు నాకు అత్యంత ప్రీతికరమైన ఆహారం. కొన్నిసార్లు చిరుతలు, కొండచిలువలు, ఎలుగుబంటి, మొసళ్లను కూడా వేటాడతాను. సైబీరియాలో ముఖ్యమైన ఆహారం మంచూరియన్ వాపితి, అడవి మగపంది, సికా జింక, మూస్, రో డీర్, కస్తూరి జింక. సుమత్రాలో సాంబార్, ముంట్జాక్, అడవి మగ పంది, మలయన్ టాపిర్లు ఆహారంగా తీసుకుంటా. ఆ మాట కొస్తే... కుందేళ్లు, చేపలతో సహా దేన్నీ వదిలిపెట్టను.

మీరు మా వేషాల్లో

నేను ఎంత ప్రాచుర్యమంటే... తెలుగు రాష్ట్రాల్లో శతాబ్దాలుగా పులివేషం వర్ధిల్లుతోంది. మీకు తెలుసో లేదో ఇదో జానపద కళారూపం. దీన్ని వేత నృత్యమని కూడా పిలుస్తుంటారు. హిందూ, ముస్లిం అనే మత వివక్ష లేకుండా దసరా, సంక్రాంతి పండుగలకు, మొహరం, పీర్ల పండంగలకూ పులివేషం వేస్తారు. పులివేషం వేసినవాళ్లు లయబద్ధంగా వేసే అడుగులు చూసి నాకు నేనే మురిసిపోతుంటాను. నా తీవిని వాళ్లలో చూసుకుంటాను. ఇప్పుడంటే... నా వేషం వేసేవాళ్లు తగ్గిపోయారు గానీ.. ఒకప్పుడు ఆంధ్రదేశం నలుమూలల పల్లెపల్లెనా పులి నృత్యాలను మీరూ చూసే వుంటారు. అసలు పులి నృత్యాన్ని ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చింది పల్లె ప్రజలే. పులివేషం వేసినవారు నృత్యంలో చూపే నైపుణ్యానికి పిల్లలు భయపడేవారంటే నమ్మండి. నాకైతే భలే సంతోషంగా వుండేది.

ఇదేం వినోదం

అడవికి రారాజునైన నన్ను దురదృష్టవశాత్తూ సర్కస్‌లో వినోదాన్ని అందించే స్థాయికి దిగజార్చేశారు. నా స్వేచ్ఛను అడ్డుకుని బోనులో బంధిస్తున్నారు. దీనికి ప్రభుత్వాలు, వన్యసంరక్షణ కేంద్రాలు ఎందుకు అనుమతిస్తున్నాయో అర్థం కాదు. ఇదే జరిగితే భవిష్యత్‌లో బోనుల్లో చూడటానికి కూడా మేము మిగలకపోవచ్చు. ఇంటర్నెట్‌లో ఫోటోలు చూసుకోవాల్సిన పరిస్థితి దాపురించవచ్చు. అందుకే పాలకులు, అధికారులు మా స్వేచ్ఛను కాపాడాలి. రాచరికపు వ్యవస్థలోనూ మమ్మల్ని వినోద వస్తువుగానూ, వేటాడబడే జంతువుగానే చూశారు. బ్రిటిష్ హయాంలోనూ విచ్చలవిడిగా వేటాడారు. 1920 కాలంలో కల్నల్ జెఫరీ నైటింగేల్ అనే బ్రిటిష్ సైనికాధికారి ఏకంగా మా ముత్తాతలైన 300 పులులను మట్టుబెట్టాడు. మహేష్ రంగరాజన్ అనే

ఆశలు.. ఆవిర్లు...

ఇటీవల కాలంలో పులుల సంరక్షణకు చేపట్టిన చర్యలు కొంతమేరకు సత్ఫలితాలని స్తున్నట్టు కనిపిస్తోంది. మహారాష్ట్రలో పులులు అధికంగా ఉన్న తాడోబా పులుల అభయారణ్యంతోపాటు పెంచ్, సహ్యాద్రి, మెల్ఘాట్, నగ్‌జీరా నవేగామ్, బార్ అభయారణ్యాల్లో 190 పులులున్నాయి. 2010లో అభయారణ్యాల్లో 169 పులులుండగా వీటి సంఖ్య 190కి పెరిగాయి. అసోం రాష్ట్రంలోని కజిరంగ జాతీయ వనంలో పులుల సంఖ్య పెరిగిందని తాజా పులుల గణనలో వెల్లడైంది. 860 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న కజిరంగ అడవిలో 83 ఉన్న పులుల సంఖ్య మూడేళ్లలో 104కు పెరిగిందని తాజా గణనలో తేలింది. అసోం రాష్ట్రంలోని కజిరంగతోపాటు మనాస్, ఆరంగ్, నమేరీ పులుల అభయారణ్యాల్లోనూ పులుల సంఖ్య పెరిగిందని వెల్లడైంది. గత కొన్ని సంవత్సరాలుగా తగ్గుతూ వస్తున్న పులుల సంఖ్య ఎట్టకేలకు పెరిగింది. ఏడేళ్ల కింద 1400 ఉన్న పులుల సంఖ్య ప్రస్తుతం 2,226గా నమోదయినట్లు పర్యావరణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2010 నుంచి పులుల సంఖ్య 30 శాతంపైగా పెరిగింది. 2010నాటి గణన ప్రకారం 1,706 పులులు ఉన్నట్లు నిర్ధారించారు. 2014లో చేపట్టిన లెక్కింపులో పులుల సంఖ్య బాగా పెరిగినట్లు వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పులులలో 70 శాతం భారత్‌లోనే ఉన్నాయని పర్యావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం పులుల సంఖ్య 1,945 నుంచి 2,491 మధ్య ఉండొచ్చని అంచనా వేసినట్లు చెప్పారు. కర్ణాటకలో అత్యధిక పులులు ఉన్నాయి. 406 పులులతో కర్ణాటక అన్ని రాష్ట్రాల కన్నా ముందంజలో ఉంది. ఆ తర్వాత వరుసగా ఉత్తరాఖండ్‌లో 340, తమిళనాడులో 229, మధ్యప్రదేశ్‌లో 208, మహారాష్ట్రలో 190, పశ్చిమ బెంగాల్‌లో 76 పులులు ఉన్నాయి. వేటగాళ్లు, అక్రమంగా రవాణా చేసే అంతర్జాతీయ ముఠాలు, పులుల నివాస ప్రాంతాల కనుమరుగు లాంటి కారణాల వల్ల గత కొన్నేళ్లుగా పులుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. 20వ శతాబ్దం ప్రారంభంలో దాదాపు లక్ష పులులు ఉండగా 2008 సంవత్సరంలో ఈ సంఖ్య 1411కి పడిపోయింది. 2004లో పులుల సందర్శనకి పేరొందిన సరిస్కా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో ఒక్క పులి కూడా లేదంటే ఆశ్చర్యం కలగకమానదు. ఈ సంక్షోభం నుంచి బయట పడటానికి పులుల పరిరక్షణ కోసం అప్పటి నుంచి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది.

చరిత్రకారుని అంచనా ప్రకారం 1875 నుంచి 1925 మధ్య కాలంలో వేటగాళ్ల తూటాలకు దాదాపు 80 వేల పులులు బలైపోయాయి. స్వాతంత్ర్యానంతర కాలంలో ఇప్పటి ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా మహారాజా తాను 1150 పులులను వేటాడినట్లు 1965లో బహిరంగంగానే చెప్పుకున్నాడు. అప్పట్లో రాజవంశీకులు, జమీందార్లు తాము వేటాడిన మా పులుల చర్మాలను ఇళ్లలో అలంకారంగా ఉంచుకునేవారు. మా గోర్లతో పతకాలు తయారు చేయించుకుని, వాటిని ధరించడం ద్వారా తమ దర్పాన్ని ప్రదర్శించేవారు. ఇక స్వాతంత్ర్యానంతరం విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి మన ప్రభుత్వం వేట కోసం భారత్ రావచ్చంటూ ఆహ్వానించింది. దీంతో మా సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 1971 నాటికి మన దేశంలో పులుల సంఖ్య 1800కు పడిపోయింది. ఆలస్యంగా మేల్కొన్న ప్రభుత్వం... మా సంరక్షణ కోసం 1972లో రూపొందించిన 'ప్రాజెక్ట్ టైగర్' 1973 నుంచి అమలులోకి వచ్చింది. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి 2006లో సవరణ తెచ్చి, జాతీయ పులుల ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసింది. మన దేశంలో మా పులుల కోసం 47 అభయారణ్యాలు ఉన్నాయి. అటవీశాఖ అధికారులు నిత్యం పులుల జాడల కోసం యత్నించాలి. ఇందుకోసం 'టైగర్ ట్రాకర్స్'ను నియమించారు. ఇది మా పులుల జాడ చెప్పే ఇన్‌ఫార్మర్ వ్యవస్థ. సాధారణంగా స్థానిక గిరిజనులను ఇందుకు ఏర్పాటు చేసుకుంటారు. మా పులుల అడుగుజాడలు గుర్తించే విధంగా వారికి శిక్షణ ఇస్తారు. వారిచ్చిన సమాచారం మేరకు ఆయా ప్రాంతాల్లో కెమెరాలు అమర్చి సంరక్షణ చర్యలు చేపట్టాలి. ఒక్కోసారి మా పులులకు కేంద్రమైన అభయారణ్యానికి తరలించే ప్రయత్నం చేస్తారు. అయితే ఈ టైగర్ ట్రాకర్స్ వ్యవస్థ కూడా సరిగా పనిచేస్తున్న దాఖలాలు లేవు.



మా విలాపం.. విన్నపం...

అడవుల్లో ఎక్కడ చూసినా మృగ విలాపమే. ఏ పులీ గాండ్రించడంలేదు. విలపిస్తోంది... వణికిపోతోంది. రాజసం ఉట్టిపడే బెబ్బులిలాంటి నాకే రక్షణ కరవైంది. గాండ్రింపుతో అడవిలో ఇతర జంతువులను హడలెత్తించే నేను ఇపుడు నిలువునా వణికిపోతున్నా. మానవ మృగాల ధాటికి గుండెలవిసేలా విలపిస్తోన్నా. జాతీయ జంతువునైనా నా ఉనికే ప్రమాదంలో పడింది. ఇక సాధారణ జంతుజాలం పరిస్థితి చెప్పనలవికాదు. రాజసం ఉట్టిపడే బెబ్బులికే ఇపుడు రక్షణ కరువైంది. వేటగాళ్ల బారినపడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. మా కోసం ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రాల్లోనూ రక్షణ లేకుండా పోతోంది. అధికారులు నిఘా పెడుతున్నా... వేటాగాళ్లకు కళ్లెం పడటంలేదు.

ఒకప్పుడు నేను జాతీయ జంతువునని పొంగిపోయేదాన్ని. ఆ హోదా వల్ల ఒరిగిందేమీ లేదని ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. ఒక్క గాండ్రింపుతో మదపుటేనుగును సైతం పరుగులు పెట్టించే నేను... ప్రాణభయంతో అల్లాడిపోతున్నాను. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో అడవులు అంతరించడం, అరణ్యాలలో సరైన మదుగు లేకపోవడం వల్లనే మేము ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. పెరుగుతున్న పట్టణీకరణ ప్రభావంతో అడవులు క్షీణించిపోతున్నాయి. ప్రస్తుతం 93 శాతం పులులు కేవలం అడవుల నరికివేత వలన అంతరించిపోతున్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వీటితో పాటు అనేక రకాల జంతువులూ అంతరించిపోతున్నాయి. నేనే కాదు అటవీ ప్రాంతాల్లోని అనేక జీవ జాతులు అంతరించిపోతున్నాయి. నా కళ్ల ముందే ఎన్నో జాతులు కనుమరుగయ్యాయి. ప్రాణం ఉగ్గబట్టుకొని బతుకున్న నా జాతిని కొంతవరకైనా సంరక్షించే ప్రయత్నం చేయబట్టే మిణుకుమిణుకుమంటున్న దీపంలా మేమైనా మిగిలాం. అలాగే మిగతా జంతు జాతులను కూడా సంరక్షించాలి. అడవులను వృద్ధి చేయాలి. అప్పుడే ప్రకృతిలో పర్యావరణ సమతౌల్యం వర్ధిల్లుంది. లేకపోతే మేము కూడా అంతరించిపోయే ప్రమాదం వుంది. వేటగాళ్ళు, స్మగ్లర్లు రెచ్చిపోతుండటంతో.. వన్యప్రాణులకు నిలువ నీడ లేకుండా పోతోంది. విద్యుత్ షాక్ ఇచ్చి మరీ పులులు, ఇతర వన్య ప్రాణులను హతమార్చుతున్నారు. మమ్మల్ని దారుణంగా వేటాడటానికి, స్మగ్లింగ్ చేయటానికి కారణం చర్మం, గోర్లు, దంతాల విలువే కాదు.. అనేక నాటు వైద్యాల్లో మా ప్రతి భాగాన్ని వాడతారు. ఇవి అశాస్త్రీయ పద్ధతులు. ఫలితాలు లేనివి. అందువల్ల మాకు హాని కలగకుండా రక్షణ ఏర్పరచాలి. ప్రభుత్వం వాటి మా మనుగడ కోల్పోకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఇకనైనా టైగర్ ట్రాకర్స్ వ్యవస్థను పటిష్టపరచాలి. నా పరిస్థితి ఏ ఒక్క హృదయాన్ని కదిలించినా... తనువులు పంచండి...తరువులు పెంచండి.. తరుగులు పూడ్చండి.

టాప్-5 రిజర్వ్‌లు

పులుల సంరక్షణ వ్యవహారంలో ప్రభుత్వంతో పాటు ప్రభుత్వేతర రంగాలకు చెందిన వారి పాత్ర కూడా ఉంది. పులుల సంఖ్య పెరగడం ద్వారా ఎకో సిస్టమ్‌లో మంచి మార్పులు సంభవించడమే కాకుండా, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందడానికి మంచి అవకాశాలున్నాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఇక, అసలు విషయానికి వస్తే, మన దేశంలో పులుల సంఖ్య ఎక్కువగా ఉండే టాప్-5 టైగర్ రిజర్వ్‌లు ...

- ☐ టడోబా అంధారి టైగర్ రిజర్వ్, మహారాష్ట్ర
- ☐ పెంచ్ టైగర్ రిజర్వ్, మధ్యప్రదేశ్
- ☐ బందీపూర్ నేషనల్ పార్క్, కర్నాటక
- ☐ పన్నా నేషనల్ పార్క్, మధ్యప్రదేశ్
- ☐ నాగర్‌హోల్ నేషనల్ పార్క్, కర్నాటక

మొసలి రాకుమారి



వర్షాలు పడాలని కప్పలకు పెళ్లిళ్లు చేయడమే ఓ విచిత్రమనుకుంటే మెక్సికో వాళ్లు ఇక్కడోళ్లను మించేశారు. సాన్ పెడ్రో హువామెలూలాకు మేయర్‌గా చేస్తున్న విక్టర్ అగ్యిలార్ ఓ మొసలిని పెళ్లాడేశాడు. మత్స్యకారులకు మేలు జరగడం కోసం ఈ ఆచారం అక్కడ ఎప్పటి నుంచో నడుస్తోంది. వారి భాషలో రాకుమారిగా పిలిచే ఆ మొసలికి బాప్టిజమ్ ఇచ్చి ఓ తెల్ల గౌన్‌లో ముస్తాబు చేసి ఊరంతా ఊరేగించి మరీ పెళ్లి వేదిక మీదకు తీసుకువస్తారు. అది వరుణ్ని కరవకుండా మూతి కట్టేస్తారులెండి. ఇలా ప్రతి ఏటా కొత్త మొసలిని వివాహమాడాలని వొయాక్సాకా ప్రాంతంలో ఎప్పటి నుంచో ఉంది. దీనికో లెజెండ్ కూడా అప్పుడే అల్లేశారు. మనిషి మొసలిని పెళ్లి చేసుకోడానికి... సముద్రంలో చేపలు ఎక్కువగా పెరగడానికి లింకేంటో మాత్రం అర్థం కాక బుర్ర గోక్కుంటూనే మేయర్ మొసలికి భర్త అయిపోవడం అక్కడ సాధారణం. మొసలిని రాకుమారిగా చూసుకోవడం ఇక్కడ అసాధారణం. అలా అంటే అక్కడ కప్పలకు పెళ్లి చేయడం కూడా అలానే అనిపిస్తుందేమో.

వింత లోకం

హైహీల్స్‌తో కొండెక్కి...

హైహీల్స్‌తో జాగ్రత్త..! పట్టు తప్పితే మడిమ విరిగే అవకాశం ఉందనే మాటలు వినబడుతూనే ఉంటాయి. తిన్నగా రోడ్డు మీద నడవడంతోనే సతమతమయ్యే దృశ్యాలు కనిపిస్తూనే ఉంటాయి. ఇక మెట్లెక్కడం, దిగడం కూడా హైహీల్స్‌తో చేయగలగడం అక్కడక్కడా సినిమాలు, మోడలింగ్ ఆడిషన్ పరీక్షల్లో ఉంటాయట. ఎందుకింత చెబుతున్నామంటే ఒక బ్రిటీష్ కుర్రోడు విచిత్రమైన ఫీట్ ఎత్తు తెలీడానికి. లండన్‌కు చెందిన పందొమ్మిదేళ్ల బెన్ కాన్వే హైహీల్స్ వేసుకుని 1345 అడుగుల ఎత్తున్న ఓ కొండను ఎక్కేశాడు. వర్షం కురుస్తున్నా ఉదయం 8 గంటలకు మొదలెట్టి ఐదు గంటలపాటు యాతనపడి చివరకు శిఖర దర్శనం చేసుకున్నాడు. యూకేలోనే ఎత్తైనదిగా పిలిచే బెన్ నెవీస్ పర్వతాన్ని ఇలా ఎక్కడానికి కారణం స్కాలర్‌షిప్ కోసం.

బ్రిక్టన్‌లోని స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్ ఆర్ట్స్‌కు ఇలా తన ప్రత్యేకతను వ్యక్తం చేశాడట. ఈ ప్రమాదకర విన్యాసం చేసేందుకు మరికొన్ని మంచి కారణాలు కూడా ఉన్నాయి. ఎల్జీబీటీ హక్కుల కోసం, కనీసం చెప్పులు కూడా లేకుండా తిరిగే పేద పిల్లలకు జోళ్లు అందించడం కోసం. వింత మంచిదే.

ఏకాగ్రత హెల్మెట్..!

మనం కొంతమందిని చూస్తాం. వారి ఏకాగ్రత కుదరడం కోసం అడవుల్లో టెంట్ ఏసుకుని కథలు రాస్తుంటారు. తలుపులు, కిటికీలు అన్నీ మూసేసి పరీక్షలకు చదువుకుంటుంటారు. మరీ ఇంత ఇదా అని మనమేమన్నా అన్నామే అనుకోండి. చేసే పని మీద శ్రద్ధ పెట్టడానికీ మాత్రం లేకపోతే పెన్ను కదలదు... కీ-బోర్డు అరగదు అని బాధల రాగమెత్తుతారు. ఇలాంటి వాళ్ల కష్టాలు కొన్నింటికైనా అడ్డుకట్ట వేసేందుకు ఓ హెల్మెట్ పెట్టేస్తోంది యుక్రెయిన్‌కి చెందిన హోచు రాయూ అనే సంస్థ. శబ్దాన్ని నిరోధించే ప్రత్యేక ఏర్పాట్లున్న హెల్మ్‌ఫోన్ అనే ఓ భారీ ఐసొలేషన్ హెల్మెట్‌ను ఆ సంస్థ రూపొందించింది. బయటి నుంచి వచ్చే ఏ ధ్వనినైనా అడ్డుకుని కేవలం కంటి ఎదురుగ్గా ఉన్న విషయాల్ని మాత్రమే చూడగలిగేలా డిజైన్ చేసిన ఈ హెల్మెట్ పెట్టుకుంటే ఉన్న చోటునే తమకంటూ ప్రత్యేకమైన 'స్పేస్' దొరికేసిందని సంబరపడొచ్చుట. కేవలం బయట ధ్వనుల్నే కాదు హెల్మెట్ పెట్టుకుని కదులుతుంటే మనకు కొన్ని శబ్దాలు వస్తాయి. అవి చిరాకుగాను ఉంటాయి. వీటిని కూడా హెల్మ్‌ఫోన్ అడ్డుకుంటుంది. స్మార్ట్‌ఫోన్‌కు కనెక్ట్ అయ్యే అవకాశం మాత్రం ఉంది. చూడ్డానికి వ్యోమగాముల హెల్మెట్ అంత కనిపించే ఈ హెల్మెట్ ఆలోచన రావడానికి మరో విషయం ప్రభావం చూపింది. ఒక ఐటీ కంపెనీ తమకో సరికొత్త ఫోన్‌బూత్‌ను రూపొందించాలనే ప్రాజెక్ట్ హోచు రాయూకి వచ్చింది. సహచరులతో సంబంధం లేకుండా ఎవరి పనిలో వాళ్లు తలమునకలయ్యేలా ఉండే ఏర్పాటు క్యూబికల్స్‌తో కుదరడం లేదు ఇంకా ఏదన్నా అడ్డుపెట్టాలనే యోచన ఉందేమో... ఒకేసారి ఇటు ఆఫీసులోను అటు వారి ఏకాంత ప్రపంచంలోను ఉండే అనుభూతి కలిగించే కమ్యూనికేషన్ డివైస్‌ను వాళ్లు కోరుకుంటే ఇలా ఈ హెల్మెట్ బయటకొచ్చింది.

మీరు మాత్రం అందులోనే మరో ప్రపంచంలో ఉంటారులెండి. ఏకాగ్రత ఏమోకానీ రానురాను మనుషులు మరీ మానవ సంబంధాల్లో పలుచబారి రోబోల్లా మారిపోతున్నారేమో అనిపిస్తుంది. ఇక మనలా ఆలోచించే రోబోలెందుకో..!

తెలుసా

పచ్చని తీరంలో...

● ఎక్కువగా చిత్తడి నేలలు, నదీపరీవాహక ప్రాంతాల్లో వుండే ఈ వృక్ష సమూహాలు పక్షులు, చేపలతోపాటు ఇతర జంతుజాతులకి ఆహారాన్ని నివాసాలని కలిగించేవిగా వున్నాయి.

● మడ అడవులు గుబురుగా పొదల మాదిరి ఏపుగా పెరిగేందుకు ఇవి ఎక్కువగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి మూలకాలని ఎక్కువగా గ్రహించడమే కారణం.

● స్పానిష్ వలస వాదులు ఉప్పు శాతాన్ని ఎక్కువగా కలిగుండే మ్యాన్‌గ్రూవ్ ఆకులని ఆహారంలో మంచి రుచికోసం వినియోగించేవారు.

మడ అడవుల పేరు చాలామందికి తెలిసే వుంటుంది. ఇది తీరానికి ప్రకృతి వేసిన రక్షణ. సముద్రపు ఆటుపోట్లు, తుఫాన్ ప్రభావాల తీవ్రతని తగ్గిస్తాయి. సముద్రప్రాణుల జీవవైవిధ్యాన్ని నిలుపుతాయి.

● తీరప్రాంతంలో ఒక సమూహంగా లేదా పొదల రూపంలో గుబురుగా పెరిగే చెట్లే ఈ మ్యాన్‌గ్రూవ్స్..

● ప్రపంచవ్యాప్తంగా ముఫైఐదుకు పైగా మ్యాన్‌గ్రూవ్ మొక్కల రకాలు కనుగొనబడ్డాయి. వాటిలో వైట్ మ్యాన్‌గ్రూవ్, బ్లాక్ మ్యాన్‌గ్రూవ్, రెడ్ మ్యాన్‌గ్రూవ్, బాటమ్ వుడ్ మ్యాన్‌గ్రూవ్ నాలుగు రకాలు ప్రధాన రకాలుగా గుర్తింపుపొందాయి.

● ఔషధ పరమైన లక్షణాలున్న మ్యాన్‌గ్రూవ్ బెరడుతో టీ తయారీ కోసం కొన్ని దేశాల్లో వీటిని ప్రత్యేకంగా సాగుచేస్తుంటారు.

● కొన్ని రకాల కీటకాలు పక్షులు, సాలీడుల నుండి కాపాడుకొనేందుకు మ్యాన్‌గ్రూవ్ ఆకుల ఆకారంలో ముడుచుకొని తమని తాము కాపాడుకుంటాయి.

● తెలుపు, నలుపు మ్యాన్‌గ్రూవ్ మొక్కలకి పూచే పూలలో 'నెక్టార్' అనే పదార్థం ఉంటుంది. తేనె తయారీలో 'నెక్టారే' కీలకం.



● ఈజిప్ట్‌లోని కైరోలో వాడి అల్ హితాన్ ప్రాంతంలో 40 మిలియన్ సంవత్సరాల నాటి మ్యాన్‌గ్రూవ్ శిలాజాలు ఇప్పటికీ మనకి దర్శనమిస్తాయి.

● ఎక్కువగా ఇసుక ద్వీపాలు ఏర్పడేది ఈ మడ అడవుల ద్వారానే..

● వీటికి ఇతర చెట్లలా కాకుండా ఉప్పునీటికి తట్టుకునే ఓ ప్రత్యేక లక్షణం వుంది. సముద్రతీర ప్రాంతాల్లో ఇవి దట్టంగా పెరగడానికి ఈ ప్రత్యేక లక్షణమే కారణం.

● పగడపు దిబ్బల్లో పెరిగే జీవరాసులు, చిన్న చిన్న మొక్కలకి ఆక్సిజన్‌ని అందించడంలో ఎక్కువగా ఇవి తోడ్పడతాయి.

● ఉష్ణ, ఉప ఉష్ణ మండలాలతోపాటు ఆసియా, ఆఫ్రికా, నైరుతి పసిఫిక్ ప్రదేశాల్లో మనకి మడ అడవులు ఎక్కువగా కనిపిస్తాయి.

● దట్టంగా, చిక్కుబడి వుండే మ్యాన్‌గ్రూవ్ వేర్లు నీటిలోని ధూళిని సేకరించడం ద్వారా ఎక్కువ శాతం దీవులు తయారవుతుంటాయి.

● వీటి వేర్లు వరదలు, సునామీల తీవ్రతని అడ్డుకునే శక్తిని కలిగుంటాయి.

● వీటి వేర్లలో వుండే టాన్నిస్ అనే పదార్థంతోపాటు తీరప్రాంతాల్లో హార్బర్‌లని ఏర్పాటుచేసుకునేందుకు వీటిని వినియోగించడంద్వారా ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఇవి కనుమరుగవుతున్నాయి.

● భారత్, బంగ్లాదేశ్ తీరంలో ఉండే సుందరవనాల ప్రాంతం మడ అడవుల్లో పెద్దది. మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా జిల్లాల తీర ప్రాంతాల వెంబడి కూడా వున్నాయి.



తెలుగు చలన చిత్ర పరిశ్రమ అయిదో దశకంలో
ఆరు, ఏడు ఎనిమిది దశకాల వరకూ దినదిన
ప్రవర్థమానమవుతూ తన ఉనికిని చాటుకొ
ఆణిముత్యాల్లాంటి చిత్రాలను అందిస్తూనే ఉ
ఈ కాలాన్ని స్వర్ణయుగంగా చెప్పుకుంటాం
నిర్మాతలు సినిమాని ప్రేమించేవాళ్లు.. దర్శకు
వ్యవహరించే వాళ్లు. అలా సినిమా రంగంలో పె
తెలుసుకొని... సినిమాని సినిమాగా ప్రేమించే వ్య
నహతా. వీరి సారథ్యంలో ఎన్నో విజయవంతమై
సినిమాలొచ్చాయి. వీరికి తోడు మంచి పారదర్శక
పి.డూండే (విజయవాడ వాసి). ఈ ఇద్దరూ కలిసి స
నిర్మాణం చేపట్టిన చిత్రం 'రక్త సంబంధం'.

తెలుగువారి 'రక్త సంబ

తమిళంలో 'పాశమలర్' అనే చిత్రం చాలా విజయవంతమైంది. శివాజీ గణేశన్, సావిత్రి అన్నా చెల్లెలుగా నటించారు. దీనికి ఎ.భీమ్‌సింగ్ దర్శకత్వం వహించారు. ఎం.ఎస్. విశ్వనాధన్ మ్యూజిక్ అందించారు. ఈ సినిమా విజయంలో సింహ భాగం మహానటి సావిత్రికే చెందుతుంది. తరువాత శివాజీ గణేశన్. తదుపరి చెప్పుకోవలసిన వ్యక్తి స్వరకర్త ఎం.ఎస్. విశ్వనాధన్. తన పాటలు తమిళనాట ఊరువాడలా మార్మోగి పోయాయి. ఆ సినిమా తెలుగులో నిర్మిస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచన సుందర్‌లాల్ గారికొచ్చింది. సహచరుడు డూండే గారితో ఈ ఆలోచన పంచుకు న్నాడు. బాగానే ఉంటుందిగానీ.. తెలుగులో ఎవరు చూస్తారు? అన్నా చెల్లెలుగా ఎవర్ని పెడతాం? చెల్లెలు పక్కన జంటగా ఎవరు నటిస్తారు? అనే అనుమానాలు మొదట్లో వ్యక్తపరిచారు నహతా. కొంతకాలం ఈ చిత్రాన్ని వాయిదా వేసుకున్నారు. ఒకసారి వి.మధుసూదనరావు గారు కలిశారు. సరిగ్గా ఈ సినిమా ప్రస్థావనే వచ్చింది. 'పాశమలర్' తెలుగులో రీమేక్ చేస్తే చాలా బాగుంటుంది అన్న అభిప్రాయం వ్యక్తం చేశాడు. నహతా గార్కి తన ఆలోచనలకు ఊతం ఇచ్చినట్లనిపించింది. ముందు అక్కినేని గారిని సంప్రదించారు. ఆయన నిర్మొహమాటంగా 'సావిత్రి తప్ప మరొకరు ఈ పాత్రకి న్యాయం చెయ్యలేరు. అలా అని ఇప్పుడు నేను సావిత్రికి అన్నగా నటిస్తే... జనం తిప్పి కొడతారు. మరేదైనా ప్రాజెక్టుని ప్లాన్ చెయ్యండి.. చూద్దాం!' అని అన్నాడు. సుందర్ లాల్‌లో పట్టుదల పెరిగిపోయింది. వెంటనే రంగంలోకి దిగి యన్.టి.ఆర్.ని డూండీగారి ద్వారా సంప్రదించారు. ఆయన రెండో ఆలోచన లేకుండా ఆల్ ది బెస్ట్ బ్రదర్ అని చెప్పి డేట్స్ కన్‌ఫర్మ్ చేశారు. సావిత్రమ్మని స్వయంగా నహతాగారే సంప్రదించారు. ఆమె బావుంటుంది గాని ఇంత ట్రాజెడీ సినిమా తెలుగులో చూస్తారా? అంది అనుమానంగా. 'అంతా నీ చేతుల్లో వుంది. నిన్ను చూస్తారు. నువ్వేం చేసినా ఎలాచేసినా చూస్తారు. మా సినిమాకి ప్రాణం నువ్వే' అని అంటూ సుందర్‌లాల్ తన మనసులో మాట బైటపెట్టారు. తరువాత సూర్యకాంతం, కాంతారావు, దేవిక తదితర పాత్రలు కుదిరిపోయాయి. సంగీతం ఎం.ఎస్. బిజీగా వుండి చెయ్యలేకపోయారు. ఆ బాధ్యత ఘంటసాలకి అప్పగించారు. సినిమాని సాధ్యమైనంత తక్కువ బడ్జెట్‌లో పూర్తి చెయ్యాలని నిర్ణయించుకున్నారు.

ముళ్ళపూడి వారికి పెద్ద ఛాలెంజ్

'రక్తసంబంధం' సినిమా శోకసముద్రం. తమిళంలోనే అంతగా ఆదరణ పొందలేదు. అలాగని నష్టపోనూ లేదు. తెలుగులో ఎవరు చూస్తారు? అనుమానం కొట్లాడుతూ వుండగా రమణ గార్ని రచయితగా ఎన్నుకోవడం పలువురు నిర్మాతలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అప్పటికి ముళ్ళపూడి ఇండస్ట్రీకి కొత్త. హాస్యరచనలు చెయ్యడంలో ప్రసిద్ధుడు ఈయన. నాటకీయత, హెవీ మెలోడ్రామాలని ఏం పండించగలుగుతాడు? అంటూ పెదవివిరుస్తూ.. అవహేళనగా మాట్లాడారు. రమణగారు దీన్ని ఛాలెంజ్‌గా తీసకుని రాశారు. ఆశ్చర్యం ఏమిటంటే రెండువారాల్లో సినిమా షాట్ డివిజన్‌తో సహా పూర్తిచేసి బైండ్ బుక్కు అందించారు. ఆ బైండ్ బుక్‌ని చూసి మధుసూదనరావు ఆనందపడిపోతూ "ఇది శుభారంభం. మీరు దిగులుపడకండి. అంతా మంచే జరుగుతుంది" అని ధైర్యం చెప్పారు. రామారావు గారు, సావిత్రిగారూ 'తెలుగువర్షన్' చూసి ఇందులో ఏదో మేజిక్ వుంది. చదువుతుంటేనే ఏదో తెలియని భావోద్వేగం కలుగుతోంది డోంట్‌వర్రీ బ్రదర్! మీరు నమ్మకంగా ప్లాన్ చెయ్యండి... మీ నమ్మకమే మీకు రక్ష! అంటూ శుభం పలికారు.

చిత్రం పాటలు

'రక్తసంబంధం' చిత్రం మొదలైనప్పట్నుంచీ అనిశెట్టి సుబ్బారావు గారు స్క్రిప్ట్‌ని ఫాలో అవుతూనే వున్నారు. మంచిపట్టు దొరికింది. పాటల రచన వెనుక ఆయన వెన్నంటివున్నారు. ఘంటసాల వారిని స్వరరచన కోసం కూర్చోబెట్టారు. ఏం చెయ్యలేని పరిస్థితి. తమిళంలో ఇంత పాపులర్ అయిన సాంగ్స్‌ని స్వరం మార్చి వాటిని చెయ్యలేను అన్నాడు. తమిళ వర్షన్‌కి ఎం.ఎస్. విశ్వనాథన్ ధైర్యాన్ని పణంగా పెట్టి మ్యూజిక్ చేశారు. ఈ పాటల్లో సందర్భ శుద్ధి వుంది. వీటిని ఎలా మార్చను? అని తటపటాలుస్తుండగా 'మాస్టారూ! మీరు చెయ్యాలనుకున్న పాటలు చెయ్యండి. లేదు తమిళంలో ట్యూన్సు తెలుగులోనూ బావుంటాయని మీకనిపిస్తే అవ్వే వుంచేయండి. మీ సంతకం మాకు కావాలి!" అన్నారు సుందర్‌లాల్‌గారు. ఘంటసాల వారు సరే అని ఒప్పుకున్నారు. అందులో అన్నా చెల్లెళ్ల అనుబంధం మీద సాగేపాట, పెళ్లి సమయంలో పాడేపాట ఈ రెండు పాటలూ వదిలేసి మిగతా అన్ని పాటలకూ

ఊపందుకొని

ంటూనే ఉంది.

ంది. అందుకే

. ఆ రోజుల్లో

ుగా

కకువలు

సుందర్‌లాల్

కలిగిన వ్యక్తి

ంయుక్తంగా

ంధం'

ఎం.ఎస్.స్థాయికి ఏమాత్రం తగ్గకుండా చేశారు. వదిలేసిన పాటల్లో మొదటది 'చందురుని మించి అందమొలికించు ముద్దుపాపాయివే... నిన్ను కన్న వారింట కష్టములనీడ కరిగి పోయేవులే...' పాట ఒకటి. 'బంగారు బొమ్మ రావేమే... పందిట్లో పెళ్లి జరిగేనే...' ఇది రెండో పాట. ఈ రెండు పాటల జోలికి వెళ్లకుండా మిగతా పాటలకు స్వర రచన చేశారు. ఈ పాటల్ని అనిశెట్టి రాశారు. 'ఆకాశమేలె అందాల రాజు నా కెదురైనాడే....' దేవిక పాత్ర పాడిన పాట సి.నా.రె రాస్తే 'ఓహో వయ్యారి వదినా... ఉలుకెందుకే... నీ వగలన్ని ఒకేసారి చూపకే ఆరుద్ర రాశారు. 'మంచిరోజు వస్తుంది మాకు బ్రతుకునిస్తుంది'. పదిమందిని పోషించే పనివస్తుంది. కొసరాజు గారు రాశారు. అన్ని పాటలూ సందర్భ శుద్ధితో సాగినవే'.

సావిత్రి నటన!

స్క్రిప్ట్ చదివిన దగ్గర్నుంచీ యన్.టి.ఆర్ చెప్పింది ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే. మొత్తం నూటికి నూరు మార్కులు సావిత్రి కొట్టేస్తుంది. సావిత్రి తమిళంలో చేసింది. కనుక ఆమె నటన నల్లేరు మీద నడకలా సాగిపోయింది. అయినా తెలుగులో 'రక్త సంబంధం' చిత్రం చేస్తున్నపుడు చాలా కష్టపడింది. ఈ మాట తనే చెప్పింది. ఒక్కోసారి డైలాగ్ చెప్పి స్పృహతప్పి పడిపోయేది. ఇంకోసారి డైలాగ్ చెబుతున్నపుడు డైరెక్టరు మధుసూదనరావు 'కట్' చెప్పడం మరిచి పోయేవారు. మరోసారి సావిత్రి డైలాగ్ చెబుతున్నపుడు ఉద్వేగాన్ని ఆపుకోలేక సెట్లో యూనిట్ సభ్యులందరూ.. అది షూటింగ్ అనే విషయాన్ని మరిచిపోయి... మధ్యలోనే చప్పట్ల వర్షం కురిపించే వారు. అటువంటి సమయంలో సావిత్రి చాలా కష్టపడవలసివచ్చేది. సావిత్రితోబాటు టీమ్ అందరూ మళ్లీ ఆ స్థాయి అభినయం చెయ్యాలంటే యమయాతన పడేవారు. ఒకానొక సందర్భంలో మధుసూదనరావు గారితో 'బ్రదర్' సావిత్రమ్మ ఉన్న షాట్స్ సాధ్యమైనంత వరకూ సోలోగా ప్లాన్ చెయ్యండి. కాంబినేషన్‌లో చేస్తే మా మూడ్ అంతసేపు సస్టైన్ చెయ్యలేకపోతున్నాం!.' అని అనేవారు. అయినా డైరెక్టరుగారు సన్నివేశాలు పండించడంలో తమిళం కంటే ఎక్కువ శ్రద్ధ తీసుకున్నారు. సినిమా చూస్తున్నవారికి అది షూటింగ్ అనిపించలేదు. కాంతారావు గారైతే నిజ జీవితంలో నిజంగా తన తోబుట్టువు ఏడుస్తున్నట్లనిపించి కంటతడి పెట్టుకున్నారు.. మీరు ఒక్క సావిత్రి మీద కాన్సన్ట్రేషన్ చేస్తున్నారు. మేం తేలిపోతున్నాం ! అంటూ' విసుక్కొనేవాడు. అయినా డైరెక్టరు తనపని తాను చిత్తశుద్ధితో చేసుకుపోయాడు. సావిత్రి 'రక్తసంబంధం' సినిమా పూర్తయ్యే వరకూ అదే ట్రాన్స్‌లో వుండిపోయింది. గ్లిజరిన్ పెట్టుకోవడం సావిత్రికి ఇష్టం వుండదు. ఎమోషనల్‌గా ఫీలయ్యి ఏడ్చేది. కళ్లు వాచిపోయేవి. మళ్లీ ఆ వాపులు తగ్గడానికి మందులు. ఒక్కోసారి షూటింగ్ కూడా ఆపేసేవారు. ఉదయం షూటింగ్ క్యాన్సిల్ చేసినా మళ్లీ మధ్యాహ్నానికి సెట్‌రైట్ అయ్యి సెట్‌కి వచ్చేసేది. అదీ సావిత్రి నైజం! అందుకే 'రక్తసంబంధం' సినిమా మీద సావిత్రి సంతకం చిరస్మరణీయంగా నిలిచిపోయింది!

నేను నటించలేను బాబోయ్

ఈ సినిమాలో ఓ తమషా జరిగింది. సావిత్రి నటిస్తుండగా సూర్యకాంతం ఉక్కిరిబిక్కిరై ఏడ్చేది. ఒక్కోసారి తన డైలాగ్ మరిచిపోయేది. సావిత్రిని తిట్టాలి, కొట్టాలి, విరుచుకు పడి నానా చిత్రహింసలు చెయ్యాలి అటువంటిది టేక్ అనగానే తన దగ్గరికొచ్చి సావిత్రి చెబుతున్న డైలాగ్‌లకు తన డైలాగులు మరిచిపోయి మూగదానిలా చూస్తూ వుండిపోయేది సూర్యకాంతం. షాట్ మళ్ళీ చెయ్యమని వచ్చేది. మళ్ళీ చెయ్యడమంటే సావిత్రి మళ్ళీ కష్టపడి నటించవలసి వచ్చేది అది చూసి



విలవిల్లాడిపోయేది. "అయ్యా డైరెక్టరు గారూ! నేనీ సినిమాలో నటించలేను. ఈ తల్లి పడుతున్న కష్టాలు చూడలేను. సమయానికి డైలాగులు గుర్తుకురావడం లేదు. కళ్ళల్లో కోపం కనపడ్డం లేదు. ఏడుపొస్తోంది"! అంటూ అభ్యర్థించింది. ఇది మధుసూదనరావు కాంప్లిమెంట్‌గా భావించారు. "అమ్మా! సావిత్రి... ఈ సినిమా ఘన విజయం సాధిస్తుంది అని చెప్పడానికి ఇంతకు మించిన నిదర్శనం ఏముంటుందమ్మా! రక్తసంబంధం చిత్రం మీద నీ ముద్ర నిలిచిపోతుంది" అని అభినందించారు.

అఖండ విజయం

'రక్తసంబంధం' చిత్రం రిలీజయ్యింది. అఖండ విజయం సాధించింది. అన్నాచెల్లెళ్ళ నటనని అందరూ ఆదరించారు. అన్నాచెల్లెళ్ళ బంధానికి ఈ చిత్రాన్ని ఇప్పటికీ ఉదాహరణగా చెప్పుకుంటారు. యన్.టి.ఆర్. సావిత్రి సోలో ఫోటోలు వారి లైఫ్‌టైమ్ ఆల్బమ్‌గా నిలిచిపోయాయి. రజతోత్సవాలు జరుపుకుంది. జీవితంలో ఎప్పుడూ సినిమాలు చూడనివాళ్ళూ ఈ సినిమాని చూశారు. యన్.టి.ఆర్., సావిత్రిల మీద ఈ సినిమా ఎంత ప్రభావం చూపించిందంటే.. ఆ తర్వాత వారిదద్దరూ జంటగా చాలాకాలం నటించలేకపోయారు. ఇక 'చందురుని మించు అందమొలికించు' పాట ఇంటింటా మార్మోగిపోయింది. 'బంగారుబొమ్మ రావేమే.. పందిట్లో పెళ్ళి జరిగేనే' ఈనాటికీ పెళ్ళిపందిళ్ళలో మారుమోగుతూనే వుంది. సుందర్‌లాల్ నహతా, డూండీ కలలు నిజమయ్యాయి. యన్.టి.ఆర్. విజన్ రుజవయ్యింది. కడుపుబ్బా నవ్వించే రమణ గారు కన్నీరు మున్నీరుగా ఏడ్పించారు. ముఖ్యంగా సావిత్రి నట జీవితంలో కలికితురాయిగా నిలిచిపోయింది. ఈ చిత్రం తర్వాత అన్నా చెల్లెళ్ళ వేడుకలు జరిగాయి. అన్నగారికి భోజనాలు పెట్టడం, చెల్లెళ్లకి కానుకలివ్వడం విస్తృతంగా ప్రచారంలోకొచ్చాయి.

ఈ సినిమాలో ఏముందంటే... మానవ సంబంధాలు అన్నా చెల్లెళ్ళ బంధంలోని అరుదైన మాధుర్యం 'అన్న' అనే పదానికి అర్థం వుంది. చిత్త శుద్ధితో కష్టపడి పనిచేస్తే పనివాడి దశ నుంచి పనిచ్చేవాడి స్థితికి ఎదగొచ్చని తెలుస్తుంది. ఎంత ఎదిగినా కాలం చేతిలో కీలు బొమ్మలం. అదే జీవితం అనిపిస్తుంది. అందుకే ఇప్పటికీ రక్తసంబంధం చిత్రం చూస్తున్నప్పుడు కనీసం ఆ చిత్రం తలపుకి వచ్చినప్పుడు కళ్ళ నీళ్ళు చెమరుస్తాయి!

- ఇమంది రామారావు

9010133844

కవిత్వం

ఒక్కోసారి

ఒక్కోసారి అలానే అనిపిస్తుంది
మనసంతా ఒక శూన్యంలా!
నడక మొదలవ్వాలంటే
మళ్ళీ మూలాలకు వెళ్లాల్సిందే!
అణువులు కలిసి పదార్థమైనట్లు
పదాలను పేర్చి అర్థాలను అద్దుతూ
మాటలను పేర్చి మౌనాలను మింగుతూ!
ఒక్కొక్క జ్ఞాపకాన్నీ తవ్వి తీస్తూ
ఒక్కొక్క క్షణానికి శ్వాసను నింపుతూ
మునుపటిలా కొత్తదనం అందుకోవాలి!

ఒక్కోసారి అలానే అనిపిస్తుంది
ప్రపంచమంతా ఒక యంత్రంలా!
జీవనం మొదలవ్వాలంటే
మళ్ళీ లోలోనికి వెళ్ళాల్సిందే!
తడి జ్ఞాపకాలను దిగమింగుతూ
సవ్వడి చేసే నవ్వులను అల్లుకుంటూ
కాల ప్రవాహంలో కొట్టుకుపోకుండా
అక్కడక్కడా ఆత్మీయతలను నాటుతూ
అక్కడక్కడా నేనున్నానని నమ్మకమిస్తూ
సాగిపోతూ ఆశలను అందుకోవాలి!
మనసే మన బలమూ, మన బలహీనమూ!

- పుట్టి గిరిధర్
9491493170



ఆకలి ఉట్టి

రోజుటిలానే
పిల్లల ఆకలిని మోస్తూ
పళ్ళెంలో మెతుకులన్నీ
అమ్మ చేతి వేళ్ళతో ఆడుకుంటాయి
ప్రేమ ముద్దలు తినిపించి
ముద్ద ముద్దకి
చేలో కలుపు మొక్కలు
చేసిన గాయాలను
బిడ్డల నవ్వుల్లో
దాచేసుకుంటుంది అమ్మ..
ఖాళీ అయిన అన్నం కుండ
మరునాటికి అమ్మ గుండెపై
ఆకలి ఉట్టై వేళ్ళాడుతుంది

- వైష్ణవి శ్రీ
8977237345

కొత్త కోక

కథ



శేష చంద్ర

9440581463

వర్షాల దెబ్బకి వీధులన్ని బోసి పోయాయి. అప్పుడే తెరిపించినా ఇంకా కరెంట్ రాకపోవడంతో చాలా సేపు ఇంట్లో కూర్చోలేక కాబోలు బైటికొచ్చి గొడుగులా పరుచుకొన్న పచ్చని చెట్ల కింద కూర్చుని భర్తతో ఫోన్‌లో మాట్లాడుతోంది భైరవి. ఇంతలో కొన్ని పిలుపు ఆమె చెవిన పడింది. "పొరకలమ్మ..... పొరకలూ" అంటూ ఓ కీచు గొంతు అరుచుకొంటూ పోతుంది. దాని తర్వాత "బొరుగులమ్మా .....బొరుగులు సోడేపల్లి బొరుగులు...". ఇవన్నీ రోజూ భైరవి వినే గొంతులే. అంతా ఆడవాళ్లే. "సిక్కెంటెకలకు పిన్నీసులు.. పూసలు.... అద్దాలు... దారాలు..." అని దీర్ఘం తీస్తూ ఆ పాత గొంతులకు మరో కొత్త గొంతు విన్పించింది భైరవికి. అన్ని గొంతుల్లా ఈ గొంతు వీధి వెంబడి అరుచుకొంటూ పోకుండా, అక్కడక్కడ ఇంటింటి దగ్గర నిలబడి మరీ అరుస్తుంది. ఎవరు తనకు పలకకపోయినా తన ప్రయత్నం మానకుండా. భైరవి ఇంటి ముందు నిలబడి అరిచింది. "సిక్కెంటెకులకు పిన్నీసులు పూసలు ...." అంటూ . భైరవి కూర్చీలోంచి లేవకుండానే "వద్దమ్మా వెళ్లు" అంది. ఆ మాట వచ్చింది ఎక్కడ్నుంచా అని పరికించి చూసేందుకు గేటు ల్లోంచి తలపెట్టి తొంగి చూస్తూ "కాసిన్ని మంచి నీల్లు ఇయ్యండి తల్లీ పిల్లోడికి గొంతు ఎండి పోతుండాది" అని అంది. పిల్లోడి గొంతు ఎండిపో తుందో లేదో కాని ఆమె గొంతు ఎండి పోతున్నట్లుగా ఆమె గొంతు పగిలినట్లుగా వినవచ్చింది భైరవికి. కుర్చీల్లోంచి లేచి బైటికి తొంగి చూసింది.

నిండా పాతిక కూడా లేని బక్క పలచటి మనిషి. ఎండిపోయినట్టు కనిపించినా చూడ ముచ్చటగా ఉంది. సరైన తిండి నీడ పట్టున పని ఉంటే కవులు వర్ణించే కావ్యకన్యకలా ఉండేదేమో. బురదలో పూచి వాడిన పువ్వులా ఉంది. మాసిపోయి ఉతికితే పీలికలైపోయేలా చిరుగులు నిండిన చీర ఆమె వంటిని దాచడానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్లుంది. రవిక పరిస్థితి దానికి భిన్నంగా ఏమి లేదు. కుడి, ఎడమ భుజాలపై రెండు జోలెలు. కుడి పక్క జోలెలో పిల్లోడు. ఎడమ పక్క జోలెలో వెంట్రుకలకు ఆమె ఇవ్వబోయే సామాన్లున్నాయి. ఎడమ చేతి మణికట్టు మీద వేలాడుతూ ఓ సవరం, చేతిలో కొన్ని చిక్కెంట్రుకలు... తననే తదేకంగా చూస్తున్న భైరవిని చూసి మరోసారి "కొన్ని నీళ్లీ తల్లీ పుణ్ణెముంటాది. దప్పికైతాండాది." అంటూ జోల ల్లోంచి చిన్న గిన్నె తీసింది. భైరవి మరేమి మాట్లడకుండా లోపలికి వెళ్లింది. చిక్కెంట్రుకలామె గేటు ఆనుకొని లోపలికి చూస్తూండి పోయింది.

గిన్నెలో నీళ్లు పడగానే గొంతు తడుపుకుంది. ప్రాణం లేచి వచ్చినట్లైంది ఆమెకు. గిన్నె నిండుతుంటే "కొద్దిగుండు తల్లి" అని పిల్లోడికి తాపించసాగింది. పాపం వాడు దప్పికతో ఉన్నాడో లేక ఆకలికి తాళలేకో ఆత్రంగా గిన్నెలో సగం నీళ్లు వాడే తాగాడు. తన వంకే చూస్తున్న భైరవితో "ఎంటుకలుంటే ఇయ్యి తల్లి పిన్నీసులిస్తా..." అంది. "లేవు.. ఉంటే పిన్నీసులేం అక్కర్లేకుండా ఇచ్చేదాన్ని. ఇంతకి ఈ చిక్కెంట్రుకల్తో ఏం చేస్తారేమిటి" అంది ఆశ్చర్యపోతూ భైరవి. ఆమె భైరవి వైపు వింతగా చూసింది. "ఏంసేయడమేంది తల్లీ దీంతోన సవరాలు సేస్తాం. దండిగా వత్తే హైదరాబాది పంపేటోళ్లం. ఆడ టోపన్లు సేస్తారంటా!" అంది. ఆ సంపాదనతో జీవితం ఎలా నెట్టుకొస్తున్నారో అనుకుంటూ "రోజుకు ఎంత సంపాదిస్తావ్ ఏమిటి" అని అడిగింది. ఆమె నిరాశగా "యాడ తల్లి! రోజులు ముందులా లేవు. అప్పుడు రోజంతా తిరిగితే రెండు సవరాలైన ఎంటుకలు వస్తుండే. ఇప్పుడు పదిదినాలు తిరగినా సెవరమైన రావడంలా. దానికి తోడు పారేసే చిక్కెంటుకలకు బేరమాడుతుండారు జనాలు. గిరాకీ పెరిగి గాములు లెక్క కొన ఎగబడిరి మా వోళ్లు కొంతమంది. మా అట్టాటోళ్లు ఎట్టా బతకలేక ఇట్టా బతుకీదుస్తుండాం." అంది. ఆమెను చూస్తుంటే జాలి కలిగి "నీ మొగుడు ఇదే పని చేస్తాడా" అంది. మొగుడి మాట అడగ్గానే ఆమె ముఖం మ్లానమైంది. తన మొగుడి గురించి చెడ్డగా చెప్పలేక చెప్తున్నట్లు "ఏదో కూలీకి పోతాడు తల్లి. వొళ్లు గుల్ల సేసుకుంటాడు కానీ ఏం పెయజనం. పైసలు ఇంటికి తెచ్చిందిలేదు. తాగి తందనాలా డ్తాడు. ఎప్పుడో వోడికి బుద్ది పుడ్తే నాల్గు పైసలిస్తడు. పిల్లోడుండాడు నాలుగు రూకలు ఎనకలేద్దామని వోడి బతుకైనా బాగుండులే సూద్దామని లేదు వోడికి. తాగుడు తప్ప వోడికి మరో లోకం నేదు. వోడికి తాగను లేనప్పుడు వోడిచ్చిన పైసలేమి సేసినావని గొడ్డును బాదినట్టు బాదుతాడు." ఆమె కంట్లో నీళ్లు చెంపల మీద నుండి కారుతుంటే .... చంకలోని పిల్లోడు ఏమి అర్థం కాకపోయినా ఆమె ముఖంలోకి దీనంగా చూస్తూ ఆమె చెంపలపైన నిమరసాగాడు. భైరవికి అనవసరంగా ఆమెను బాధపెట్టానేమో అన్పించింది. ఆమె కొద్దిసేపు మౌనగా నిలబడి

నీళ్లు తాగిన గిన్నె జోలెలో పెట్టుకొని అక్కడ్నుంచి కదిలింది. ఆమె వైపే చూస్తుండిపోయింది భైరవి. ఆమె నాల్గడుగులు వేసి ఏమనుకొందో ఏమో మళ్లీ వెనక్కి వచ్చి జాలిగా ముఖం పెట్టి సిగ్గువిడిచి.. "అంత బువ్వుంటే ఎట్టు తల్లి. పిల్లోడికి పాలు లేవు. ఆకలికి సోరకం వచ్చేటట్టున్నాది." అడగలేక అడుగుతున్నట్లు మెల్లగా అడిగింది దీనంగా. ఆ ఇంట్లో ఉండేది భైరవి ఆమె భర్తే. ఆమె భర్త భోజనానికి రానని చెప్పడంతోను తను ఇంకా తినక పోవడంతో ఇంట్లో పని మనిషి చేసి పోయిన భోజనం ఎలా ఉండేది అలాగే ఉంది. "ఉండు తెస్తాను" అంటూ లోపలికి పోయిన భైరవి అన్నం, కూరగిన్నెల్తో వచ్చి, గేటు తాళం తీసి ఆమెను లోపలికి రమ్మని పిల్చింది. చేతిలో గిన్నెల్తో వచ్చిన భైరవిని చూసి ఆమె సంతోషంగా చూసి జోలెలోని గిన్నె బైటికి తీస్తుంటే... "కడుపు నిండా ఇక్కడే తిను" అంటూ గిన్నెల్తో పాటు తెచ్చిన విస్తర తీసి దాన్నిండా వేడి అన్నం పెట్టి కూరలేసింది. ఆమెకు భైరవి తన ఆకలి తీర్చవచ్చిన దేవతలా కనపడింది. మరో మాట మాట్లడకుండా జోలె తీసి పక్కన పెట్టి, పిల్లోడ్ని కూడా జోల్లోంచి తీసి తొడపై కూర్చోపెట్టుకొని విస్తర ముందు కూర్చుంది. వేడి వేడిగా తెల్లగా పొడి పొడిగా విస్తర నిండా పెట్టిన అన్నం దాని పైన కూర చూసి ఆమె ఆనంద పడిపోతూ వేడిగా ఉన్న అన్నం నోటితో ఊపి చల్లార్చి కొద్ది కూర మెత్తగా కలిపి పిల్లోడికి తినిపించసాగింది. పాలు తప్ప మరేమి తాగలేని ఆ పసి వయసులో ఆకలికి తాళలేక కాబోలు వాడు ఆవురావురమని తినసాగాడు. వాడికి తృప్తిగా తినిపించి తను తినసాగింది. విస్తర్లో సగం తిన్నతర్వాత మిగిలిన అన్నంకూరల్తోనున్న విస్తర ముడుస్తుంటే "అదేమిటి అప్పుడే ఆకలి తీరిపోయిందా..!" అంది భైరవి ఆశ్చర్యంగా. ఆమె అలా ఎందుకు చేస్తుందో అర్థంకాక. "చాల్లమ్మగోరు. కూర సానా బాగుండాది. రాతిరికి నా పెనిమిటికింత పెడదామని మిగిలిచ్చిన" అంది. "ఎంత కొట్టినా తిట్టినా మొగుడి మీద ఆడది చూపే ప్రేమాభిమానాలు మగాడు ఎప్పుడు అర్థం చేసుకుంటాడో కదా?" అనుకొంటూ "నువ్వు కడుపు నిండా తిను. నీ మొగడి క్కూడా పెడ్తానులే. తీసుకెళ్దువు" అంది. దాంతో ఆమె మారు మాట్లడకుండా తినేసింది. తర్వాత భైరవి ఆమె గిన్నెల్లోకి మిగిలిన అన్నం కూరా వేస్తుంటే "మీరు తిన్నారా అమ్మా? అంతా నాకే పెడ్తాంద్రు" అంది. "పర్వాలేదులే ఆయన రానన్నాడు. నాకు ఆకలిగా లేదు." అంది. ఆ మాట అన్నాక తను ఒక్కతే ఉన్నానన్న విషయం చెప్పానే అన్న కంగారు పడింది భైరవి.

సిటీ బైట కొత్తగా పడిన కాలనీ కావడంతో తన భర్త రోజూ ఆఫీసుకు పోయేముందు "తొందరపడి ఎవర్నీ లోపలికి రానీకు. ఎవరు ఎలాంటి వారో తెలుసుకోవడం కష్టం. జాగ్రత్తగా ఉండు." అని చెప్పే మాటలు గుర్తుకొచ్చాయి. ఆమె తృప్తిగా అన్నం తిని కృతజ్ఞతా పూర్వకంగా తన వైపు చూస్తూంటే బైటికి వెళ్లమని చెప్పలేకపోయింది భైరవి. అయినా ఆ బక్క మనిషి తననేం చేయగలుగుతుందిలే అనుకుంది. కాని తన వంటి మీద ఉన్న నగల కోసం తెగించిన ఆమె దాడి చేస్తే అన్న ఊహ రాగానే భైరవి అక్కడే ఉండేందుకు జంకి "వెళ్లే ముందు గేటు వేసుకెళ్లు" అంటూ ఆమెకు చెప్పి వడి వడిగా ఇంట్లోకి పోయింది.

లోపలికి పోయిందే కాని ఆమెకు కనపడకుండా ఆమె ఏం చేస్తుందో అని లోపల్నుంచి గమనించసాగింది. భైరవి లోపలికి పోయాక ఆమె చెట్టు నీడన ప్రశాంతంగా కూర్చుంది వళ్లో పిల్లోడ్ని పెట్టుకొని. వాడికి ఆకలి తీరిందేమో అమ్మ ఒడిలో కూర్చుని ఆడుకోసాగాడు. ఆమె వాడి ఆటలకు మురిసిపోతూ ముద్దులాడ్తూనే ఇంటిని పరికించి చూడసాగింది. పచ్చని లాన్ విరబూసిన రంగు రంగుల పూలు వాటి మధ్యలో రెండు కుర్చీలు. చుట్టూ చూసిన ఆమె చూపులు కుర్చీలపైన పడి ఆగి పోయాయి. దాంతో పిల్లోడ్ని ఎత్తుకుని, భైరవి ఇంట్లోకి పోయిన వైపు పరీక్షగా చూస్తూ మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ కుర్చీల దగ్గరికి వచ్చింది. భైరవికి ఆమె చేసే పని అర్థం కాలేదు. కాంపౌండు లోపల కుర్చీలు తప్ప తీసుకపోగలిగినవి ఏమీ లేవు. బహుశా వాటిని తీసుకుపోవాలని చూస్తుందా? ఒకవేళ ఆమె అలా చేసినా తను ఏం చేయగలుగుతుంది. తను ఒంటరిగా ఉండటంతో ఆమెను ఆపే ధైర్యం లేదు. అలాగనే గట్టిగా కేకలేసి ఆమెను ఆపేందుకు రోడ్డు బోసిపోయి ఉంది. చుట్టు పక్కల ఇళ్లలో బైట ఎవరు ఉండరు. ఒంటరిగా ఉన్నానని చెప్పి తప్పు చేశానేమో అనుకుంది భైరవి. ఆలోచన్లు అలా సాగుతుండగానే ఆమె కుర్చీల దగ్గరికి వచ్చి నిలబడి మళ్లీ భైరవి వెళ్లిన వైపు చూసి ఒక నిశ్చయానికి వచ్చిన దానిలా కుర్చీ దగ్గరగా కూర్చుని పిల్లోడ్ని కుర్చీలో కూర్చోపెట్టింది..! వాడు కుర్చీలో వెనకలా జారిగల పడి కూర్చోవడం చూసి సంతోషంగా వాడితో ఏదో అంటూ వాడి రెండు చెంపలు నిమిరి తన తలకు ఆనించికుని మెటికలు విరుచుకుంది. వాడు ఠీవిగా కూర్చున్న తీరు చూసి కాబోలు సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బు అవసాగింది. ఆమె చుట్టూ చూసిన చూపుల కర్థం అవగతమయ్యాక ఆమెను అపార్థం చేసుకున్నందుకు తనను తాను నిందించుకుంది భైరవి.

తృప్తిగా పిల్లోడ్ని కుర్చీలో కూర్చోబెట్టి చూసుకున్నాక పిల్లోడ్ని తీసుకొని పైకి లేచిందామె. ఆమె చీర కుర్చీకి తగులుకొని పర్రున చిరిగి చీలికలైంది. చీలికైన చీరను కుర్చీ నుంచి తప్పించుకుంటూ "అయ్యో దేముడా..!" అని అంది అప్రయత్నంగా. నిలువుగా చిరిగిన చీరతో వళ్లు కనపడకుండా కట్టుకునేందుకు నానా తంటాలు పడసాగింది. ఇందతా చూస్తున్న భైరవికి ఆమె మీద జాలి వేసింది. ఆమెకు చీర ఇవ్వాలన్న కోరిక బలంగా మనసులో కలగగా బీరువా తెరిచి చూసింది. ఓ చీర దాంతో పాటు రవిక తీసింది ఆమెకు ఇవ్వడానికి.

భైరవిచ్చిన కొత్త చీర, రవిక. వాటి నుంచి వచ్చే సెంటు వాసనను చూసి మురిసిపోసాగింది ఆమె. "కొత్త కోక ఎంత బాగుండాది. పాణముండగా ఇట్టాటి కోక కట్టుకొంటాననుకోలే." అని చీరను గట్టిగా హత్తుకుంది. "ఆ కొత్త కోక కట్టుకున్న తనను మొగుడు ఎనకనుండి సూసి ఎవరబ్బా తన గుడిసెలోకి వచ్చిందని యోచన్లో పడ్తాడు. అది నానే అని తెలిసినాక కొత్తపెల్లికూతర్లాగా మెరిసి పోతుండావేందే అంటడేమో. వోడట్టా ఆచ్చర్యంలో ఉండగానే గిన్నె నిండా బువ్వ కూరా పెట్తా. సానా సంతోసపడ్తడు. ఏందే పొద్దుగల్ల నక్కతోకను తొక్కినవు అంటడు." అంటూ ఊహించుకోసాగింది. మరోసారి ఒకపారి తన మీద అనుమానంతో చిత్తుగా తాగి చితకబాదిన సంగతి గుర్తుకొచ్చి "వోడు పీకల్దాక తాక్కుంటా వస్తే వోడి బుద్ది ఎట్టా ఉంటదో కొత్తకోకను సూసి సెడ్డగా అనుకొని రచ్చ సేస్తాడేమో." అని భయంగూడ వేసిందామెకు. కొత్తకోక ఇప్పుడు కట్టుకోకుండా పొద్దుటే వోడికి సూపించి కట్టుకొంటే సరి.. అనుకుంది. కాని కొత్త చీర కట్టుకోవాలన్న ఆమె కోరిక దాన్ని అణగ దొక్కడంతో సీకటి పడేదాకే వెంట్రుకల కోసం తిరిగే ఆమె ముందుగానే గుడిసె చేరుకొంది.

సిటీ బైట సముద్రపు ఒడ్డుకు దగ్గర్లో వెలిసిన గుడిసెలవి. పక్క గుడిసెల్లో ఇంకా ఎవరు రాలేదు. పిల్లోడ్ని చాప మీద నిద్ర పుచ్చి చీర రవికను జాగ్రత్తగా నొక్కుపోయిన పెట్టెలో పెట్టింది. గబగబా గుడిసె లోపలా బైట క్షణంలో ఈతాకు పొరకతో కసువు ఊడ్చింది. బోరు దగ్గరికి పోయి చేతులు నొప్పి పుట్టే వరకు కొట్టగా నిండిన రెండు బిందెల నీళ్లు తెచ్చేసుకుని, గుడిసానుకొని చుట్టు గోనె సంచులు కట్టిన జాలాడిలో అరిగిపోయిన సబ్బుబిళ్లనే పూర్తిగా అరగదీసి స్నానం చేసింది. కొత్త రవిక తొడుక్కొని కొత్త చీర కట్టుకొని పగిలిన అద్దంలో పదే పదే తన రూపాన్ని చూసుకోసాగింది. బైటికెళ్లి కొత్త కోకను అందరికి చూపాలని ఉన్నా చుట్టు పక్కలోళ్లు కళ్లలో నిప్పులు పోసుకొంటారని బైటకి వెళ్లలేదు. గుడిసెలోనే భర్త కోసం ఎదురు చూడసాగింది. సూరీడు పోయి చీకట్లు ముసురుకోసాగానే కిరోసిన్ బుడ్డి వెలిగించింది. ఆవెల్తురల్లోను తన కొత్తకోక మెరిసిపోతుండటంతో తను మరింత మురిసిపోసాగింది. పిల్లోడికి అన్నం తినిపించి, తనకు ఆకలవుతున్నా మొగుడి కోసం ఎదురు చూస్తూ చింకి బొంత మీద పండుకోలేక పండుకొని అలాగే నిద్రలోకి జారుకొంది.

నడ్డి మీద ఎవరో బలంగా తన్నినట్లన్పించడంతో ఉలిక్కి పడిలేచిందామె. కొడి కట్టిన కిరోసిన్

బుడ్డి చీకటిని ఎదుర్కోలేక గుడ్డి వెలుతురునిస్తుంది. ఆ గుడ్డి వెల్తుర్లో ఆమె కళ్లు నులుముకొని పూర్తిగా నేల మీద నిలబడలేక తూగుతున్న మొగుడ్ని చూసి బిత్తరపోయి చివాల్న లేచి నిల్చుంది. వాడు కొత్త చీర కట్టిన ఆమెను, దాన్నించి వచ్చే గుబాళింపునకు ఆమె తన గుడిసెనా.. తన పెళ్లామేనా పొరపాటున తన్న లేదు కదా అని సందిగ్ధంలో పడి తల విదిల్చి పరికించి చూశాడు. తను తన్నింది తన భార్యనే అని నిర్ధారణకు రాగానే వాడి చూపుల్లో మార్పు వచ్చింది. ఆ స్థితిలో నున్న వాడ్ని వాడి చూపుల్ని చూసి జరగరాని ఘోరమేదో జరగబోతున్నట్లు బిక్కచచ్చిపోయి మానులా నిలబడి పోయింది ఆమె. "ఏందే కొత్త కోక సింగారించినవు. యాడిది..? యాడ తొంగొడి సంపాదించినావే .... ఏ నా .... కొడుకు ఇచ్చాడు." అంటూ బూతులు తిడుతూ మీదకు రాసాగాడు. ఆమెకు భయంతో నోరు పెగుల్చుకొని సమాధానం చెప్పేలోగానే బలంగా చెంప మీద దెబ్బ పడింది. ఆ దెబ్బకు కళ్లు తిరిగి మైకం కమ్మినట్లైంది ఆమెకు. పళ్ల బిగువున బాధను భరిస్తూ కళ్ల నిండా నీళ్లు కక్కుంటూ.. "ఏందయ్యా అట్టా అంటావు. ఓ మహాతల్లీ నా సినిగిపోయిన కోక సూసి దానం సేసినాది. మహాతల్లి నూరేళ్లు సల్లగుండాల. కొత్తకోకే కాదయ్య కడుపు నిండా బువ్వ గూడా పెట్టినాది. నీకు పెట్టిచ్చినాది. కూకోయ్య కూకో..! బువ్వ పెట్తా." అంటూ వాడు కొట్టిన దెబ్బను మరిచిపోయి ఆప్యాయంగా పిల్చి అన్నం పెట్టేందుకు అక్కడ్నుంచి పోబోయింది. వాడికి ఆమె కంఠంలోని ఆప్యాయత అనురాగం కన్నా ఆమె కట్టిన కొత్త చీర అది పొందటానికి అమేం చేసి ఉంటుందోనని తలుస్తూ, ఆమెను పక్కకు కదలనీయకుండా ఆ జుట్టు వడిసి పట్టుకొంటూ "ఏందే కతలు సెప్తుండావ్. నాకు తెల్వదనుకొన్నావే నీ యవ్వారం. ఎన్ని దినాల్నించి సాగుతుండాది. ఎవడోడు నీకు కొత్త కోక ఇచ్చి నిన్ను ...... సెప్పు యవడోడు నిన్ను వోడ్ని నరికి పోగులు పెడతా." అంటూ ఊగిపోసాగాడు. వాడి పట్టుకు జుట్టు ఊడుస్తోందేమో అన్నంత నొప్పి పెడ్తుంటే రెండు చేతుల్తో జుట్టును వాడి చేతినుంచి విడిపించుకోవాలని ప్రయత్నం చేస్తూ తానేమి తప్పు చేయలేదని ప్రాధేయపడసాగింది. "నాకు కోక దానం సేసింది ఆడదేనయ్యా. పొద్దుటే ఆ ఇల్లు సూపిస్తా. నమ్మమ"ని వేడుకోసాగింది. కాని మందు మత్తులో వాడికి ఆమె ఏడ్పులు మాటలు చెవికెక్కడం లేదు. ఎప్పుడు ఇంట్లోనే గొడవ చేసి నాల్గు దెబ్బలేసే వాడే కాని ఇలా మాట్లడింది లేదు. బలమైన అనుమానం పొడసూపడంతో పాటు మత్తులో మునిగి వాడికి ఉచ్ఛనీచాలు తెలియలేదు. జుట్టు పట్టుకుని బరా బరా బైటికీడ్చి పిడి గుద్దులు గుద్దుతూ, కాలితో తంతూ ".... పోయే .... వోడికాడికే పో" అంటూ కేకలేయసాగాడు. రోడ్డు మీద పోయే కార్లు మోటారు బైకుల్లోలు వెల్తుర్లో కనిపించే ఈ తతంగాన్ని చూసి అది మామూలే అన్నట్లు ఓ చూపు చూసి తమ దారిన తాము వెళ్లి పోతున్నారు. వాడి అరుపులకు చుట్టు పక్కల గుడిసెల్లోవాళ్లు నిద్రలేచారు తింటుకొంటునే. తర్వాత జరిగే భాగోతాన్ని చూసేందుకు గుమిగూడ సాగారు. కొత్త చీరలో ఉన్న ఆమెను చూసి కొందరు చెవులు కొరుక్కొంటూ మూతులు మూడు వంకర్లు తిప్పుతూ చోద్యం చూడసాగారు. జనాలు గుమికూడటం కైపుతో పాటు పురుషంహకారం తలకెక్కడంతో వాడు మరింత రెచ్చిపోయాడు. ఎక్కడెక్కడో కులుకుతూ వస్తున్న కులటవి నాకొద్దన్నాడు. నీ లాంటి దాన్ని భరించడం నావల్ల కాదన్నాడు. ఆమె జోలెలు, గిన్నెలో అన్నాన్ని బైటికి విసిరి కొట్టాడు. నిద్రలోనున్న పిల్లోడ్ని విసురుగా ఒకచేత్తో పట్టుకొ కోగానే వాడు కెవ్వున ఏడ్వటం మొదలు పెట్టాడు. దాంతో ఆమె కన్న పేగు కలత చెంది ఒక్క ఉదుటున పిల్లోడ్ని తీసుకొనేందుకు లోపలికి పరిగెత్త బోయింది. కాని వాడు ఆమెకు ఆ అవకాశం ఇవ్వకుండా ఏ మాత్రం కనికరం

చీకట్లో అవస్థ పడుతున్న ఆమెను చూసి జాలిపడి కాబోలు ఆమె జీవితంలో వెలుగులు నింపలేక పోయినా ఉన్న చోటులో వెలుతురును పంచసాగాడు ఆలస్యంగా ఆకాశంలోకి వచ్చిన చంద్రుడు. వెన్నెల్లో చీర మెరిసి పోతుంటే సంతోషించడం పోయి దాని మీద అసహ్యమేసింది ఆమెకు. కడుపులో ఆకలి దేవుతుంది. తను వాడి కోసం ప్రేమతో తెచ్చిన అన్నం కుక్కలు ఎప్పుడో తినేసి గిన్నెలు నాకుతున్నాయి.

లేకుండా పిల్లోడ్ని బొమ్మలాగా విసిరేశాడు ఆమె మీదకు. కింద పడకుండా పిల్లోడ్ని పట్టుకుని ఊపిరి పీల్చుకొంది ఆమె. నేనే తప్పు చేయలేదని మొగుడికి సర్ది చెప్పమని గుమికూడిన వాళ్లకు మొర పెట్టుకొంది. ముందుకెవరూ రాలేదు. వాడు చాలా సేపు తిడ్తూనే ఉండి పోయాడు. తర్వాత లోపలికి పోయి "లోపలికి వస్తే గుడిసె లోపల్నే నిప్పెట్టి కాల్చి పారేస్తా"నన్నాడు. లేదంటే పిల్లోడ్ని గొంతు పిసికి చంపేస్తా నన్నాడు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడు ఎదురవ్వలేదా మెకు. తను కొత్తకోక మీద ఎంత మోజు పడిందో... ఆ కోకే తనకీ గతి పట్టిస్తుందని ఆమె కలలో కూడా ఊహించలేదు. వాడి ఆగడాలను ఆపలేని జనాలు ఆమెను ఓదార్చలేదు సరికదా "దానికేం పోయే కాలమే అట్టా సేసినాది. మనం కూటికి గుడ్డకు పేదోళ్లమేగాని... గునానికి కాదే... కోక గుడ్డకు పైసలకాసపడి వళ్లమ్ముకొంటారా యాడైనా. ఆ రెండోలో మూడేలో సేసే కొత్త కోక యవతో ఉత్తిపుణ్నానికే ఇచ్చినదంటే యవడు నమ్ముతాడో..! వోడు గాబట్టి బైటకు తోసినాడు నా మొగుడట్టా టోడైతే నరికి పారేసేవోడు.." అంటూ చేతులు తిప్పి తిప్పి మాట్లాడసాగింది ఓ పతివ్రత! ఆ మాటలు వాడి చెవిన పడలేదు కాని లేకుంటే వాటికి మరింతగా ప్రభావితమై వాడు మరింత రెచ్చిపోయే వాడే. ఆమెకు దిక్కు తోచలేదు. అంతా శత్రువుల్లాగా కనపడసాగారు. వాడి మనసులో కొత్త అనుమానం బీజం పడటంతో తన బతుకు మరింత నరకంలో పడిపోయిందనుకొంది. చాలా సేపటి వరకు అలాగే గుడిసె ముందు కూర్చుండి పోయింది. వచ్చిన వాళ్లు ఒక్కరొక్కరే వెళ్లిపోసాగారు. ఒక్కరు కూడా ఆమె దగ్గరికి వచ్చి ఓదార్చిన వాళ్లు లేరు. ఒకరికో ఇద్దరికో మనసులో ఉన్నా వాడి దెబ్బకు భయపడి మనసులోనే బాధపడతూ వెళ్లిపోయారు. లోపల్నుంచి వాడి తిట్లు వినవస్తునే ఉన్నాయి ముద్ద ముద్దగా.

వాళ్లంతా వెళ్లి పోయాక బైటంతా నిశబ్దమైంది అక్కడ. కాని ఆమె మనసు ఘోషిస్తుంది దరిదాపుల్లో ఉన్న సముద్రపు హోరులా. చాలా సేపటికి వాడికి కైపు తగ్గిందో లేదో మత్తునిద్రలోకి జారుకొన్నాడో కాని వాడి మాటలు లేవు. ఆమె మెల్లగా లేచింది. వాడు కొట్టిన దెబ్బలకు వొళ్లంతా హూనం కావడంతో సరిగా నిలబడలేక పోయింది. కుంటుతూనే వెళ్లి మెల్లగా గుడిసె తడికె తీయబోయింది. కాని వాడు దానికి అడ్డంగా పడిపోయి ఉండటంతో అది రాలేదు. గట్టిగా తోసి లోపలికి పోయేందుకు ధైర్యం చాల్లేదు ఆమెకు. వాడికి మెళకువ వస్తే మళ్లీ జరగబోయే రచ్చ ఆమెను భయపడేటట్లు చేస్తుంటే దిక్కు తోచక గుడిసెను ఆనుకుని చీకట్లోనే కూర్చుండి పోయింది.

ooo

చీకట్లో అవస్థ పడుతున్న ఆమెను చూసి జాలిపడి కాబోలు ఆమె జీవితంలో వెలుగులు నింపలేక పోయినా ఉన్న చోటులో వెలుతురును పంచసాగాడు ఆలస్యంగా ఆకాశంలోకి వచ్చిన చంద్రుడు. వెన్నెల్లో చీర మెరిసి పోతుంటే సంతోషించడం పోయి దాని మీద అసహ్యమేసింది ఆమెకు. కడుపులో ఆకలి దేవుతుంది. తను వాడి కోసం ప్రేమతో తెచ్చిన అన్నం కుక్కలు ఎప్పుడో తినేసి గిన్నెలు నాకుతున్నాయి. ఆవేమి పట్టనట్లు నిర్వేదంగా చూస్తూ నిద్రలోకి జారుకుంది.

కారు వెల్తురులో జిగేల్మని మెరుస్తున్న చీరను దాన్ని చుట్టుకున్న ఆమెను చూస్తూ సడన్‌గా ఓ కారు ఆగింది. డ్రైవింగ్ చేస్తున్న వాడు ఆమెను చూపిస్తూ లోపలున్న మరో ఇద్దరితో "చూడూ అది ఆ బాపతు లాగుంది ..... గిరాకి రాక అలా నిద్ర

పోతోంది. వెళ్లి రమ్మను పో." మత్తు తలకెక్కి ఉండటంతో మాటలు నాలుక తడబడుతున్నాయి వాడికి.

"వద్దురా అలాంటిది కాకపోతే. గొడవవుతుందిరా. మక్కెలు ఇరగతంతారు. పక్కనే బ్రోతల్ కొంపలుండగా ఈ గొడవలెందుకురా." వాడి పక్కనే ఉన్న మరొకడు భయంగా అన్నాడు. దానికి మరొకడు "ఛ నువ్వు వట్టి పిరికిగొడ్డువురా .... అది అట్టాంటిది అయి ఉంటుంది. కాకపోతే అట్టా కొత్త చీర కట్టుకొని గుడిసె బైట ఎందుకుంటుందిరా. ఒకవేళ అలాంటిది కాకపోయినా పర్వాలే ఒంటరిగా ఉంది. మజాగా ఉంటది. మనం ముగ్గురం ఉండాం. నోరు మూసి లాక్కొచ్చేయడమే" అన్నాడు. అలా వాళ్లు కొద్ది సేపు తర్జన భర్జనలు పడి మెల్లగా అడుగులు వేసుకుంటూ గుడిసె వైపు రాసాగారు.

ఇంతకు ముందు ఆమె మొగుడు విసిరేసిన అన్నం తిని అక్కడే పండుకుని ఉన్న కుక్కలు వాళ్లని చూసి అరవడంతో ఆమెకు మెళకువ వచ్చింది. "ఎవరాళ్లు..." అని బిగ్గరగా అంది భయంగా. సమాధానం చెప్పకుండా దగ్గరికి వస్తుంటే గట్టిగా కేకలేస్తూ తన మొగుణ్ని లేపాలని తడిక దబ దబా కొట్టసాగింది. మైకంలో ఉన్న వాడు కదలట్లేదు. పిల్లోణ్ని అక్కున చేర్చుకునే చుట్టు పక్కలవాళ్ల సహాయం కోసం గట్టిగా అరవసాగింది. ఆమె అరుపులు వినపడినా వాడు ఇంకా ఆమెను కొడ్తుంటే సహాయం కోసం అరుస్తుందేమో ఎందుకొచ్చిన గొడవ అని ఎవరు స్పందించలేదు. దాంతో బలంగా తడికెను తన్నింది. అది ఊడి పోయి మొగుడు మీద పడింది. వాడు కోపంతో నాల్గు తన్నినా వాళ్ల బారినుండి రక్షిస్తాడన్న ధైర్యంతో. వాడు కొద్దిగా కదిలి బలవంతంగా కళ్లు తెరిచే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ మత్తులోనే మూల్గుతున్నాడు. పిల్లోణ్ని ఒకచేత్తో పట్టుకునే రెండో చేత్తో వాన్ని లేపే ప్రయత్నం చేయసాగింది. తలుపు బాదుతూ ఆమె చేసే ప్రయత్నంచూసి లోపల్నించి ఎవరైనా వస్తారేమోనని జంకి కొద్ది సేపు ఆగిన తాగుబోతులు... లోపల మత్తులో పడిన వాన్ని ఆమె లేపడం చూసి ధైర్యమొచ్చి వాళ్లు గుడిసెలోకి రాసాగారు. దిక్కు తోచలేదామెకు. వాళ్ల నుండి తనను కాపాడుకునేందుకు ఏమైనా దొరుకుతుందేమో చూసింది. మొద్దు బోయిన కత్తి పీట, పుచ్చిపోయిన రోకలి బండ వాళ్లనెదుర్కునేందుకు ఏ మూలకు పనికి రావనుకుంది. వెంటనే నీళ్లతో నిండిన బిందెను ఒక్క ఉదుటున తీసుకొని మొగుడి నెత్తిన గుమ్మరించింది. చల్లటి నీళ్లు పడగానే తల విదుల్చుకున్నాడు. కళ్ల ముందు మసగ్గా ఆమె... మరో నలుగురితో పెనుగులాట చూసి బిత్తర పోయాడు. ఆమె మాటలు అస్పష్టంగా అర్థమయ్యి లేచి వాళ్లను అడ్డుకుందామనుకున్నాడు. కానీ, ఏం చేయలేకపోతున్నాడు. అరవబోయాడు. నోట్లోంచి మాట రావడం లేదు. శరీరంలో ఏ భాగం సహకరించటం లేదు. ఒక్క కళ్లు తప్ప. ఆ కళ్లు చూస్తున్నాయి. తన కళ్ల ముందే తన భార్యను చెరపట్టబో తుంటే జీవచ్ఛవంలా ఉండిపోయాడు. కాపాడమని కన్నీరు మున్నీరయ్యేలా ఏడుస్తున్న తన భార్య వైపు చూస్తున్నాడు. ఆ క్షణంలో ఏదో అలజడి. ఆమెపై ఏదో అతడిలో ఏదో మార్పు. మత్తులో ఒకడు భార్యపై జరిగే ఘోరం ఆపలేక పోతుంటే అదే మత్తులో మునిగిన తాగుబోతులు ఘోరం చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

తన మొగుడు తనని కాపాడలేడని తెలియడంతో ఆమె తెగించి ఒక్క ఉదుటున వాళ్ల గుండా దూసుకెళ్లి... పక్కన గుడిసెల తలుపులు దబదబా బాదసాగింది. బీరువై అరవసాగింది. దిక్కులు పిక్కటిల్లేలా. భూగోళం దద్దరిల్లేలా. మెరుపులు లేని పిడుగుల్లా... అరుస్తూనే ఉంది. బిడ్డ ఏడుపు దానికి తోడైంది.

దాంతో చుట్టు పక్కల జనం మేల్కొన్నారు. ఆమె కొత్తకోకను చూసి ఈర్ష్యతో ఈసడించుకొని ఆమెను దుమ్మెత్తి పోసిన జనం.... జరగబోతున్న ఘోరం చూసి విస్తుపోయింది. ఆగ్రహం కట్టలు తెగిపోగా ఉప్పెనలా తాగుబోతుల మీద పడింది.

ఆకలికి అన్నం పెట్టి ఆదరించి కొత్తకోకలిచ్చే దయాళువుల్తో పాటు... అవసరానికి ఆదుకునే జనాలింకా ఈ లోకంలో ఉన్నారని రుజువు చేస్తూ...

అంబేద్కర్ జీవితంపై మరో పుస్తకం

బహుజన దార్శనికునిగా ప్రపంచమంతా బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ని గుర్తిస్తున్న వేళ ఆయన జీవితంపై తాజాగా వచ్చిన మరో పుస్తకం ఇది. బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జానీ దీనిని 'డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్ర' పేరుతో రాసారు. ఇప్పటికే అంబేద్కర్ జీవితంపై చాలా పుస్తకాలు వచ్చాయి. తన జీవితంలోని కొన్ని సంఘటనలతో ఆయనే రాసుకున్న స్వీయ చరిత్ర కూడా పాఠకులకు చాలా భాషల్లో అందుబాటులో ఉంది. ఎండ్లూరి, పి. అబ్బాయి వంటి బహుజన రచయితలు, వసంతమూన్, టి. నటరాజ్, విజయభారతి వంటి ప్రముఖులు రాసిన పుస్తకాలు కూడా అంబేద్కర్ జీవితాన్ని వివరిస్తాయి. ఈ నేపథ్యంలోనే వచ్చిన ఈ పుస్తకం వాటి స్థాయిలో కాకపోయినా కొత్త తరానికి అంబేద్కర్ జీవితాన్ని పరిచయం చేసే ప్రయత్నాన్ని చేసింది. ఆయన జీవిత విశేషాలను కొంచెం మాత్రమే ప్రస్తావించి ఎక్కువగా ఆయన రచనల్లో ఉన్న వివరాలనే మళ్లీ మళ్లీ ఈ పుస్తకంలో రాసారు. ఆంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలైన ఉన్నత విద్యాభ్యాసం, లండన్ ప్రయాణం, మూక్‌నాయక్ పత్రిక స్థాపన, దళితులకు దేవాలయప్రవేశం, మనుస్మృతి దహనం, కాలారామ్ ఆలయప్రవేశం, రౌండ్ టేబుల్ సమావేశాలు, గాంధీ– అంబేద్కర్ వివాదాలు, కమ్యూనల్ అవార్డు, పూణే ఒడంబడిక, రమాబాయి మరణం, యోలా మహాసభ, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ స్థాపన, దేశ విభజనపై పుస్తకం రాయడం. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపన, మహర్ పటాలాన్ని ఏర్పాటు చేయడం, న్యాయశాఖా మంత్రిగా బాధ్యతలు, భారత రాజ్యాంగ రచన, హిందూ కోడ్ బిల్, బర్మాసందర్శన, అంబేద్కర్ ధమ్మ దీక్ష స్వీకారం...ఇలా పలు అంశాలను ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఎన్నో విషయాలు చెప్పాలనుకుని ఏదీ పూర్తిగా వివరించలేని అశక్తత ఈ రచనలో చాలా చోట్ల కన్పిస్తుంది. అంబేద్కర్ మత భావనలపై విరక్తితోనే దేశప్రజలకు ఒకప్పటి జీవన ధర్మంగా ఉన్న బౌద్ధ ధమ్మాన్ని స్వీకరిస్తున్నట్లు తన రచనల్లో ఎప్పుడో స్పష్టం చేసారు. అయితే ఈ పుస్తకంలో మాత్రం అంబేద్కర్ మతభావనలను ఎంతగానో అభిమానిస్తున్నట్లు, ప్రేమిస్తున్నట్లు పేర్కొనడం అవగాహనా లోపాన్ని స్పష్టం చేస్తోంది. ఇతరుల జీవిత చరిత్రలపై పుస్తకాలు రాసేసమయంలో స్వంత అభిప్రాయాలు చొప్పిస్తే ఏ రచనైనా పేలవంగా మారుతుంది. ఆంబేద్కర్ రచనలతో పరిచయం లేని వారికి ఈ పుస్తకం నచ్చే అవకాశముంది. మొత్తమ్మీద ఎలాంటి ప్రత్యేకతలూ లేకుండా వచ్చిన ఈ పుస్తకం ఆంబేద్కర్ జీవిత చరిత్రల పుస్తకాల్లో ఒకటి మాత్రమే. కానీ దీనినే ప్రామాణికంగా తీసుకోవడానికి తగినంత సమర్థత ఇందులో లేదు.

- బెండాళం క్రిష్ణారావు

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్ర
రచన: షేక్ అబ్దుల్ హకీం జాని
పేజీలు : 240,
ధర: రూ 140/-
ప్రతులకు : లక్ష్మీ శ్రీనివాసా పబ్లికేషన్స్ ఆర్.టి.సి. కాలనీ, హయాత్ నగర్, హైదరాబాద్- 501505



టిబెట్ ఓ పీఠభూమి ప్రాంతం. యాంగ్జీ నదిని ఆనుకుని వున్న ఈ ప్రాంతానికి దగ్గరలో మంచుకొండలపై కొందరు పహారా కాస్తున్నారు. ఇదంతా అక్కడి ప్రజల కోసం అనుకుంటే పొరపాటే. ఈ భద్రతంతా అక్కడి మూగజీవాల కోసం. ప్రభుత్వంతో పనిలేకుండా జీవవైవిధ్యాన్ని కాపాడే పనిని భుజాలకెత్తుకున్న ఆ గ్రామీణ తెగ గురించి మీరూ తెలుసుకోండి.

ప్రకృతి బిడ్డలు

గోరింకలు, చిలుకలు, పిచ్చుకలు ఇలా ఎన్నో పక్షులు మన కళ్ళముందే అంతరించి పోతున్నాయి. ఇంకా కొన్ని పక్షులు, జంతువులు అదే జాబితాలో చేరిపోతున్నాయి. ఇలాంటి వాటి గురించి తెలిసినా వాటిని పట్టించుకునే వారు ఎంతమంది? సమాధానం కోసం వెతకడం కంటే మార్పు దిశగా ముందడుగేయడమే మంచిదనేది దంగ్వెన్ ఫిలాసఫీ... అలాంటి ఓ ఆలోచనే టిబెట్‌లోని యుంటా ప్రాంతంలో మొదలయ్యింది. టిబెట్‌లోని షాంగ్జియాంగ్జున్ చక్కటి జీవవైవిధ్యాన్ని కలిగున్న ప్రాంతం. మొత్తం నాలుగు లక్షల చదరపు కి.మీ విస్తరించి వుండే షాంగ్జియాంగ్జున్ జీవవైవిధ్యంతో పాటు ఆసియాలోని మూడు అతి పెద్దనదులని (ఎల్లో, యాంగ్జి, మెకాంగ్) కలిగున్న ప్రాంతం. దిగువనుండే ఎన్నో గ్రామాలకి ఇదే జీవనాధారం. నీలిరంగులో వుండే గొర్రెలు, తెల్లరంగుని అలుముకున్న జింకలు, మంచు చిరుతలు ఇలాంటి ఎన్నో జంతువులకి స్థావరమైన షాంగ్జియాంగ్జున్‌లో వేటగాళ్ళ బెడద కూడా ఎక్కువే. వారానికి వందల సంఖ్యలో ఈ అరుదైన జంతుజాతులు చనిపోతుండేవి. అలాంటి ప్రాంతంలో వేటగాళ్ళ నుండి ఈ మూగ జీవాలని కాపాడేందుకు కృషిచేస్తున్న ఎన్‌జివో సంస్థ షాన్‌షుయ్. తాము నిర్వహించే పరిరక్షణా కార్యక్రమాల్లో భాగమవ్వాలంటూ స్థానికులకి పిలుపునిచ్చింది. ఈ సంస్థతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చిన మొట్టమొదటి వ్యక్తి దంగ్వెన్. షాంగ్జియాంగ్జున్‌లోని ఓ మారుమూల గ్రామం తనది. జీవవైవిధ్యాన్ని కలిగున్న ప్రాంతంగానే కాక, నదీ పరీవాహక ప్రాంతంగా వుండే షాంగ్జియాంగ్జున్ దగ్గరలో కొన్ని మైనింగ్ కంపెనీలు తవ్వకాలు మొదలుపెట్టాయి. ఆ తవ్వకాలని అక్కడి స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించడానికి దంగ్వెన్ ప్రేరణే కారణం. ఆ తర్వాత వీరికి షాంగ్జుయాంగ్ సంస్థ చేయూత తోడయ్యింది. బౌధమతానికి సంబంధించిన ఆనవాళ్ళుని కలిగున్న ఈ పర్వతాలకి హానికలించడంతోపాటు అక్కడి జీవవైవిధ్యానికి ఆటంకం కలిగే ఏ పనినైనా తిప్పికొట్టేందుకు స్థానికులు భాగమవ్వాలంటూ ఈ సంస్థ పిలుపునిచ్చింది. అలా ఈ ప్రాంతం పరిరక్షణ కోసం ఈ ఎన్‌జివో సంస్థకి ఎంతో మంది వాలంటీర్లుగా మారారు. తియాంగ్జి నదిని ఆనుకుని ఉన్న మంచుకొండలపై రాత్రి సమయాల్లోనూ వీరు పహారా కాస్తుంటారు. దీనికి అక్కడి ప్రభుత్వం నుంచి కూడా ఆమోదం లభించింది. వేటగాళ్ళు, మైనింగ్ పనుల నుండి షాంగ్జియాంగ్జున్‌ని కాపుడుతున్న దాంగ్వెన్ బృందంపై చైనాలోని ప్రముఖ పత్రికలు, టీవీ చానెళ్ళు కొన్ని కథనాలని ప్రచారం చేశాయి. అలా మైనింగ్ కంపెనీలు ఇక్కడ మళ్ళీ అడుగుపెట్టే ప్రయత్నం చేయలేదు. యుంటా గ్రామస్తులు చేపట్టిన జీవవైవిధ్య పరిరక్షణ పనులు చుట్టుపక్కల వున్న నాలుగు గ్రామాల ప్రజలని ప్రభావితం చేశాయి. వన్య ప్రాణులని వేటగాళ్ళ బారి నుండి కాపాడేందుకు ఆ గ్రామాల్లోనూ స్థానికులు పహారాలు చేపట్టారు. ఇదో మంచి పరిణామం. యుంటాలోని మంచుకొండలపై పహారా చేపట్టిన దంగ్వెన్ బృందానికి ఓ రోజు దాదాపు రెండొందలకి పైగా నీలి రంగు గొర్రెలు, జింకలు, చిరుతల పాదాల గుర్తులు కనిపించాయి. వీటిని వెంబడిస్తూ కొంత దూరం ప్రయాణించాక అవి వేటగాళ్ళ ద్వారా దారుణంగా చంపబడ్డాయనే విషయం తెలిసింది వీరికి. ఒకప్పుడు తక్కువ సిబ్బందితో ఇక్కడి జీవవైవిధ్యాన్ని పర్యవేక్షించలేక ప్రభుత్వమే ఇక్కడి బంజర భూములని స్థానికులకి అప్పగించింది. తర్వాత ఇక్కడ వేటగాళ్ళు ఎక్కువయ్యారనే కథనాలు వినిపిస్తాయి. దీనికి పరిష్కార దిశగా షాంగ్జుయాంగ్ సంస్థ ఓ కొత్త ఆలోచనని అమలు పరిచింది. షాంగ్జియాంగ్జున్ నేషనల్ రిజర్వ్‌ని జాతీయపార్కుగా మార్చే ఆ ఆలోచనకి 2016లో బీజం పడింది. నిజానికి ఆసియాలో పర్యావరణం చెక్కుచెదరకుండా వున్న ప్రాంతాల్లో టిబెట్‌లోని ఈ పీఠభూములు మొదటి స్థానంలో వున్నాయంటే దానికి ఇక్కడి స్థానికుల కృషి ఎంతో అర్థంచేసుకోవచ్చు. ప్రకృతితోపాటు స్థానిక జంతుజాతులనీ కంటికి రెప్పలా కాపాడుతున్న షాంగ్జియాంగ్జున్ వాసుల కృషి అన్ని ప్రాంతాల ప్రజలకీ ఆదర్శవంతంగా మారాలని కోరుకుందాం.



ఉత్తరాన్ని చూశా!

హాయ్ ఫ్రెండ్స్ నా పేరు జి.ఐలా. ఈ మధ్య సెలవుల్లో నేనో విహారయాత్రకు వెళ్లాను. నా అనుభూతుల్ని మీ అందరితో పంచుకోవాలనిపించింది. అందుకే మా విహార యాత్ర విశేషాలను మీ ముందు ఉంచుతున్నాను.

మేము మొత్తం 35 మంది. మా టీమ్ కెప్టెన్ కోటేశ్వరరావు తాతగారు. మా ప్రయాణం మొదలైంది ఇలా...

ముందుగా విశాఖపట్నం స్టేషన్ నుండి రాత్రి అమృత్‌సర్ ట్రైన్‌కు బయలుదేరాం రెండు రోజులు ప్రయాణం చేసి తెల్లవారుజామున 3 గంటలకు అమృతసర్‌కి చేరాం. అక్కడ ఫ్రెష్ అయ్యాక గోల్డెన్ టెంపుల్‌కి వెళ్లాం. తెల్లవారుజామున అప్పుడే ప్రసరిస్తున్న సూర్యకిరణాలు టెంపుల్ లోపలి లైటింగ్స్ మధ్య గోల్డెన్‌టెంపుల్ చాలా అందంగా ఉంది. అక్కడ అన్నింటికన్నా మా అందరికీ బాగా నచ్చింది అక్కడి వారి క్రమశిక్షణ. అక్కడ నీళ్ళల్లో బంగారు రంగులో వున్న చేపలు (గోల్డెన్ ఫిష్) చాలా బాగున్నాయి. ఓ గంట తరువాత అక్కడి నుండి జలియన్ వాలా బాగ్‌కి వెళ్ళాం. ఇది చాలా చారిత్రాత్మక స్థలం అని ప్రతి ఒక్కరూ చూడవలసిన ప్రదేశమని నేను చాలా సార్లు మా టీచర్ ద్వారా విన్నాను. ఇక్కడికి రాగానే నాకు ఆ మాటలే గుర్తుకొచ్చాయి. అక్కడకు వచ్చిన ప్రతి యాత్రికులూ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన వారికి గౌరవ ప్రదమైన నమస్కారాలు చేయడం అక్కడ కనిపిస్తుంది. అక్కడ ఉన్న బావిలో ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడానికి దూకినప్పుడు జనరల్ డయ్యర్ నాయకత్వంలోని సైన్యం చేసిన తుపాకీ కాల్పుల గుర్తులు అక్కడ కనిపించాయి. దగ్గరలోని మార్టైర్ వెల్‌ని సందర్శించిన వారందరూ చనిపోయినవారిని దైవంగా భావించి డబ్బులు బావిలో వేయడం కనిపించింది.

తరువాత వాఘా బోర్డర్‌కి వెళ్ళాం. వాఘా గ్రామం పంజాబ్‌లో ఉంది. ఇది ఇండియా - పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతం. అక్కడ ప్రతిరోజూ రెండు దేశాల జెండాల అవతనం కార్యక్రమం జరగుతుంది.

తరువాత మనాలి వెళ్ళాం. అక్కడ హిడింబి గుడి ఉంది. తను ఒక రాక్షసిగా హిందువుల పురాణాల్లో ప్రస్థావన వుంది. దేశం మొత్తం మీద అక్కడే రాక్షసులకు గుడి ఉంది. అక్కడ ప్రకృతి సిద్ధంగానే వేడి నీళ్ల ప్రవహిస్తుంటాయి. ఆ నీళ్లల్లో స్నానం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు పోతాయనే నమ్మకం. ఇక్కడికి వచ్చిన చాలామంది యాత్రికులు ఆ నీళ్ళలో స్నానాలు చేసి వెళ్తారు.

బియాస్ నది అంచున...

జలియన్‌వాలా బాగ్ తర్వాత మేమందరం కలిసి సిమ్లా వెళ్ళాం. ఇది ఏడు కొండల నముదాయం. దట్టమైన మంచుతో కప్పబడిన ఆ మంచు పర్వతాలకి దగ్గరగా వెళ్లాం. మంచు పర్వతాల దగ్గరకు వెళ్ళాలనేది నా చిన్నప్పటి కల. ఇప్పుడు నిజంగా అక్కడికి చేరుకున్నాక నా ఆనందం రెట్టింపయ్యింది. అక్కడ మా బృందం అందరం బాగా ఎంజాయ్ చేశాం. ఆ అద్భుతమైన ప్రదేశం నాకు థ్రిల్లింగ్‌గా అనిపించింది. అలాగే రాఫ్టింగ్ చేశాను. రాఫ్టింగ్ చేశాక చాలా థ్రీల్ కలిగింది. సిమ్లాలో ఎంతో ఎత్తున వున్న కొండలపై నిర్మించిన ఇళ్ళు... ఆ ఇంటికి కరెంటులాంటి సౌకర్యాలు అన్నీ ఆశ్చర్యపరిచాయి. గుర్రాలపై ఎక్కి కొండపైకి వెళ్లాం. అక్కడ యాపిల్ తోటలు పూదోటలూ వున్నాయి. కొండలపై భాగానికి అలా గుర్రంపై వెళ్ళడం, రావడం సంతోషంగానూ, భయంగానూ అనిపించింది. ఈ రైడ్‌ని అందరం ఎంజాయ్ చేశాము. సిమ్లావాళ్ళ వస్త్రధారణ నాకు చాలా బాగా నచ్చేసింది. తరువాత ఢిల్లీ వెళ్లాం. మన రాజధానిలో వున్న ఇండియా గేట్ చాలా బాగుంది. నాలుగువైపులా నాలుగు ద్వారాలతో చాలా అందంగా ఉంది.



సీతారాం ఏచూరితో..

ఇందిరాగాంధీ మ్యూజియంలో అమెకి (జ్ఞాపకాలు) సంబంధించిన కొన్ని వస్తువులున్నాయి. పార్లమెంట్ భవన్, రాజ్‌భవన్, ఇతర కార్యాలయాలు, మంత్రుల నివాసాల పక్క నుంచి ప్రయాణం హుషారుగా సాగింది.

తాజ్‌ను చూసి..

అక్కడి నుండి కుతుబ్‌మినార్



చూసేందుకు ప్రయాణమయ్యాం. ఇది చాలా పొడవైన కట్టడం. ముగ్గురు రాజుల పరిపాలనలో ఈ కట్టడం పూర్తిచేయబడడం ఆశ్చర్యాన్ని కలిగించింది. తర్వాత ఆగ్రా వెళ్ళాం. తాజ్‌మహల్ చాలా అందంగా ఉంది. పాలరాతితో చాలా అద్భుతంగా కట్టారు. అలాగే లోపల ఉన్న పురాతన వస్తువుల, మ్యూజియం చాలా బాగుంది.

తరువాత ఢిల్లీ సిపిఐ(ఎం) ఆఫీస్‌కు వెళ్లాం. అక్కడ ఆఫీస్‌పై దాడి జరిగిన ప్రదేశాన్ని చూశాం. అక్కడ కొన్ని ఫోటోలు తీసుకున్నాం. సిసి రూం, పిడి రూమ్, కామ్రేడ్ ఎకె గోపాల్, లెనిన్ స్థూపాల వద్ద సెల్ఫీల తర్వాత సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారిని కలిశాము.

మొత్తంగా ఇండియా టూర్ మా అందరి మదిలో మరపురాని పర్యటనగా నిలిచిపోయింది.

కార్న్ కోకోనట్ రైస్

కావాల్సిన పదార్థాలు
అన్నం-2 కప్పులు
నూనె-2 టేబుల్ స్పూన్లు
నెయ్యి-1 టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి ముద్ద-1 టేబుల్ స్పూన్
మిరియాల పొడి -1/2 టేబుల్ స్పూన్
ఉడికించిన స్వీట్ కార్న్ గింజలు-1/4 కప్పు
కొబ్బరి తురుము-3 టేబుల్ స్పూన్లు
నిమ్మరసం-1/2 టేబుల్ స్పూన్
కొత్తి మీర తరుగు -కొద్దిగా
ఉప్పు-రుచికి తగినంత
వెల్లుల్లి రెబ్బలు-4
క్యారెట్ ముక్కలు- 1/4 కప్పు

తయారుచేసే విధానం

బాణలీలో నూనె వేడి చేసి పచ్చిమిర్చి ముద్దను వేయించి క్యారెట్ ముక్కలు చేర్చాలి. ఇందులో ఉడికించిన స్వీట్ కార్న్ గింజలు, కొబ్బరి తురుము, వెల్లుల్లి రెబ్బలు కూడా వేయించి అన్నం కలపాలి. ఆ అరవాత మిరియాలపొడి తగినంత ఉప్పు కలిపి మరోసారి వేయించాలి. ఇదు నిమిషాల తర్వాత మిరియాలపొడి తగినంత ఉప్పు కలిపి కొద్దిసేపు వేయించాలి. రెండు నిమిషాల తర్వాత దింపేసి నిమ్మరసం కొత్తిమీర తరుగు చేర్చి వేడి వేడిగా రుచిచూడండి.



బేబీ కార్న్ ఫింగర్ చిప్స్

కావాల్సిన పదార్థాలు
బేబీ కార్న్ -10
అల్లం వెల్లుల్లి పేస్ట్- 1 టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి ముద్ద -1 టేబుల్ స్పూన్
మిరియాల పొడి - 1/2 టేబుల్ స్పూన్
ఆవాల పొడి- 1/2 టీ స్పూన్
గుడ్డు-1
బ్రెడ్ పొడి - 1/2 కప్పు
సోయాసాస్- 1 టీ స్పూన్
ఉప్పు- రుచికి సరిపడా

తయారు చేసే విధానం

ఓ గిన్నెలో అల్లం వెల్లుల్లి పచ్చిమిర్చి, మిరియాల పొడి ఆవాల పొడి, సోయాసాస్, ఉప్పు, వేసి కలపాలి. తరవాత అందులోనే బేబీ కార్న్ కూడా వేసి ఆ మిశ్రమం వాటికి బాగా పట్టేలా చేసి అరగంటసేపు నాననివ్వాలి. తరవాత వీటిని గిలకొట్టిన గుడ్డుసొనలో ముంచి బ్రెడ్ పొడిలో దొర్లించాలి. ఇప్పుడు స్టౌపై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత మొక్కజొన్న పొత్తుల్ని వేయించుకుంటే బేబీ కార్న్ ఫింగర్ చిప్స్ రెడీ!

స్వీట్ కార్న్ కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు
స్వీట్ కార్న్- ముప్పావు కప్పు
పచ్చిమిర్చి- రెండు
కొత్తిమీర- 1 కట్ట
టమాటా కెచెప్ - 3 టేబుల్ స్పూన్లు
ఉల్లికాడల తరుగు- కొద్దిగా
చీజ్ తురుము- 1/2 కప్పు
బ్రెడ్ పొడి-1/2 కప్పు
ఉప్పు- తగినంత
మిరియాల పొడి -1 టేబుల్ స్పూన్
నూనె- 1/4 కప్పు

తయారు చేసే విధానం

ఓ గిన్నెలో నూనె, బ్రెడ్ పొడి తప్ప మిగిలిన పదార్థాలన్నీ తీసుకోవాలి. అన్నింటినీ బాగా కలిపి కట్‌లెట్ల మాదిరి చేసుకోవాలి. ఒక్కో కట్‌లెట్‌ని బ్రెడ్‌పొడిలో అద్దాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత కట్‌లెట్‌ని రెండువైపులా గోధుమరంగు వచ్చేలా కాలనివ్వాలి. వీటిని వేడి వేడిగా కెచప్ లేదా గ్రీన్ చట్నీతో తింటే చాలా రుచిగా ఉంటాయి.

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనో టాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: కాజోల్

నీడతో బొమ్మ



చుక్కలు కలపండి



లెక్కిద్దాం

ఇక్కడున్న మూడు స్టార్లలో ఒక వరుసని అనుసరించి కొన్ని అంకెల్ని వుంచాం. అయితే చివరి స్టార్‌లో ఒక్క అంకె మిస్సయ్యింది. అది ఎంతై వుంటుందో కనిపెట్టి అక్కడ రాసేయండే.



ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని వస్తువులు వాటి ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. ఏ వస్తువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



బొమ్మను పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా చిరుతపులి బొమ్మని సగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండి!



దారి కనిపెడదాం



చింటు ఐస్ క్రీమ్ కొనుక్కు నేందుకు బయటికొచ్చాడు. అయితే గజిబిజావున్న ఈ దారిలో తనకి ఐస్‌క్రీమ్ బండి వద్దకి ఎలావెళ్లాలో తెలియడంలేదు. చింటు ఐస్ క్రీమ్ బండిని చేరే దారిని మీరే కనిపెట్టండి.

చిన్నారి కోయిల





పిల్లలూ! మీకు ఆటలాడడం, పాటలు పాడడమంటే ఎంతో ఇష్టం కదా! అయితే మీలో చాలామంది సింగర్స్ వుండే వుంటారు. పాటల పోటీల్లో పాల్గొని ప్రైజులు తెచ్చుకునేవుంటారు. మరి మీకు టైరా అబ్రహామ్ గురించి తెలుసా...??

భారతీయ సంతతికి చెందిన టియారా(11) వుండేది అమెరికాలోని హోస్టన్ నగరంలో... కేరళకి చెందిన టియారా తాతయ్య నానమ్మలు కొన్నేళ్ళ క్రితం యుఎస్‌లో సెటిలయ్యారు. టియారా తండ్రి సాఫ్ట్‌వేర్ వృత్తిలో స్థిరపడితే తల్లి వెటర్నరీ డాక్టర్. మూడేళ్ళు కూడా రాకముందే రాగాలు తీయటం మొదలు పెట్టిన టియారా ఇప్పుడు అక్కడ ఓ బుల్లి సెలెబ్రిటీ. చిన్నప్పుడే తన సింగింగ్ ట్యాలెంట్‌ని పసిగట్టిన తండ్రి తనకి శిక్షణ ఇప్పించారు. నాలుగేళ్ళ వయసుకే చక్కగా పాటలు పాడటం మొదలు పెట్టింది ఈ చిన్నారి. దగ్గరలోని చర్చిలో క్యారెల్స్ పాడుతుండేదట. కొన్నాళ్ళకి హాలిడే సాంగ్స్ పాడడం మొదలుపెట్టింది. అలా ఆరేళ్ళ వయసుకే ఎన్నో పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకుంది. ఇటీవలే సొంతగా ఓ ఆల్బమ్‌ని విడుదల చేసింది టియారా. 'వింటర్ నైటింగేల్' అనే పేరుతో విడుదలైన ఈ ఆల్బమ్ క్లాసిక్ క్యారెల్స్, హాలిడేసాంగ్స్‌ని కలిగుంటుంది. ఇంగ్లిష్, స్పానిష్, ఇటాలియన్, జెర్మన్, ల్యాటిన్, ఫ్రెంచ్ ఇలా మొత్తం ఆరుభాషల్లో విడుదలైన ఈ పాటలన్నింటినీ అన్ని భాషల్లో పాడింది ఈ చిన్నారే. కేవలం పాటలు పాడటంలోనే కాదు చదువులోనూ తన విలక్షణతని చాటింది. ఏడేళ్ళ వయసుకే క్యాలిఫోర్నియాలోని అమెరికన్ రివర్ కాలేజ్‌లో తన అన్నతో కలిసి 2015లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి అందర్నీ ఆశ్చర్యపరిచింది.... చైల్డ్ జీనియస్ అనే రియాల్టీ షోలో పాల్గొని బాలమేధావిగా టైటిల్‌ని సొంతంచేసుకున్న టియారా ఐక్యూకి 99 మార్కులిచ్చేసింది అక్కడి ఐక్యూసొసైటీ మెన్సా. పెద్దయ్యాక ఒపేరా గాయనిగా స్థిరపడాలనేది తన కల. ఆ కల నిజం కావాలని మనమూ కోరుకుందాం! ✦

ఆధారాలు

అడ్డం

1. అడుసు (3)
3. జాడ (3)
7. శంఖము (2)
8. రీతి (3)
9. అటునుండి మధురము (2)
13. క్షామము (4)
14. కుడినుండి ప్రత్యక్షమగు (4)
16. మొదలు లేని రక్షించు అటు నుండి (2)
17. నిండినది (3)
18. వాలము (2)
21. రక్కసి (3)
22. తెడ్డు (3)

పదవికాసం 69

కూర్పు: రావెళ్ల

	1	2			3	4		
5				6				
7			8				9	10
		11				12		
13					14			
				15				
16			17				18	
		19				20		
	21				22			

నిలువు

2. నెత్తురు (2)
4. తెలుగు లుక్ (2)
5. వైద్యుడు (6)
6. పక్షము (3)
10. పుట్టుమచ్చ (6)
11. బాధ (3)
12. వణకు (3)
15. పొడి (3)
19. బిచ్చము (2)
20. తడవ (2)

సుడోకు

		7	8		5	2		
8			6		4			5
	1			9			8	
4			2	8	9			7
5			7	6	1			2
	7			3			6	
3			1		6			4
		2	5		8	1		

గతవారం జవాబులు

6	4	7	8	1	5	2	3	9
8	9	3	6	2	4	7	1	5
2	1	5	3	9	7	4	8	6
4	3	1	2	8	9	6	5	7
7	2	6	4	5	3	8	9	1
5	8	9	7	6	1	3	4	2
1	7	4	9	3	2	5	6	8
3	5	8	1	7	6	9	2	4
9	6	2	5	4	8	1	7	3

	1 వ	2 ర	ద		3 ఋ	4 డ	త	
5 పు		బీ		6 త		ప్పు		7 మం
8 డ	బ్బు		9 చె	క్కి	లి		10 బ	డి
క		11 వ		డి		12 మ		గం
	13 ప్ర	సం	గం		14 తు	హి	నం	
15 పా		తం		16 సం		ళ		17 టెం
18 నీ	కు		19 సం	దే	శం		20 టా	కా
యం		21 బా		హం		22 క		య
	23 దు	రు	సు		24 గు	ళి	క	



చేపలు కళ్లు తెరిచే నిద్రపోతాయా? అసలవి ఎలా నిద్ర పోతాయి? అనే కుతూహలం ఉంటే ఈ చిత్రాలు మీలాంటి వారి కోసమే. చిన్న చేపలేమో కానీ ఏనుగు కన్నా పెద్దవైన స్పెర్మ్ వేల్స్ (తిమింగలాల్లో ఓ జాతి) అయితే కునుకు తీస్తాయని ఈ మధ్యే వెలుగులోకి వచ్చింది. 2008లో ఓసారి వీటిని ఇలా చూశారు. అప్పుడవి ఎందుకు అలా నిట్ట నిలువున కదలకుండా ఉండిపోయాయనే విషయం అంతుబట్టలేదు. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఈ విచిత్రమైన భంగిమలో అవి నిలిచిపోయాయి. కరీబియా సముద్రంలో డొమినికా ద్వీపం సమీపంలో స్పెర్మ్ వేల్స్ మీద ఓ శాస్త్రవేత్తల బృందం అధ్యయనం చేస్తోంది. వారికి ఈ అరుదైన దృశ్యం కనిపించింది. నీటి అడుగున ఛాయాచిత్రాలు తీసే నేర్పున్న అండర్‌వాటర్ ఫొటోగ్రాఫర్ ఫ్రాంకో బాన్ఫీ వెంటనే రంగంలోకి దిగాడు. స్క్యూబా డైవ్ చేసి వాటి చిత్రాలను బంధించాడు. ఇదే పరిశోధనలో తేలిందేమిటంటే స్పెర్మ్ వేల్స్ జీవిత కాలంలో 7 శాతం వరకు ఇలా ఓ కునుకు తీస్తాయని. అది కూడా 6-24 నిమిషాల వ్యవధిలో విరామం తీసుకుంటాయని.

తిమింగలం కునుకు





మాస్క్‌తో జరభద్రంగా...

ఢిల్లీ నడి వీధుల్లో నిర్భయ.. ఉత్తర ప్రదేశ్ గ్రామాల పొలిమేరల్లో ఓ అభయ...! పేరుల్లోనే ధైర్యం-స్థైర్యం. బెంగుళూర్ దాడుల తర్వాత కూడా పెద్ద ఉద్యమమే నడిచింది మహిళల భద్రత గురించి. కానీ దాడులు ఆగడం లేదు. ఈ దేశంలో ఆవు కన్నా మహిళే ప్రమాదంలో పడింది. మహిళ కన్నా ఆవే భద్రంగా ఉంది. ఇదే విషయాన్ని కొత్త తరహాలో చెప్పాడు కోల్‌కతాకు చెందిన ఫొటోగ్రాఫర్ సుజాత్రో ఘోష్. 23 ఏళ్ల ఈ కుర్రాడి ఆలోచన చాలామంది బుర్రల్లోని బూజుని దులుపుతోంది. ఓ అమ్మాయి ఆవు మాస్క్ వేసుకుని నడిస్తే.... ఇక భద్రంగా ఇల్లు చేరొచ్చేమో సందేశంతో ఓ ఫొటోషూట్ తీశాడు. బస్సులు, పర్యాటక ప్రదేశాలు, మార్కెట్, ఆఫీసు చివరకు ఇంటి గది వరకు ఎక్కడా స్త్రీలకు భద్రత లేదనే విషయాన్ని ఈ ఫొటోల ద్వారా చూపించే ప్రయత్నం చేశాడు. ప్రస్తుతం దేశంలో ఆవు చుట్టూతానే రాజకీయాలు, భావోద్వేగాలు నడుస్తున్నాయని, కానీ మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై మాత్రం ఆ స్థాయి చర్యలు కనిపించడం లేదని సుజాత్రో ఈ ఫొటోషూట్ ఉద్దేశాన్ని వివరిస్తాడు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి 15 నిమిషాలకు ఓ రేప్ నమోదవుతోంది. స్త్రీ సాటి వ్యక్తిగా గౌరవించే సంస్కారం ఇంటా బయటా కనిపించడంలేదు. లైంగిక దాడుల గురించి నోరు పెగిలితే సమాజం తీసుకునే తీరు.. రేప్ కేసుల్లో ఏళ్ల తరబడి జరిగే విచారణలు.. మహిళలకు భద్రత కల్పించే విషయంలో పాలకుల అలసత్వం... వంటి కారణాలతో ఇప్పటిలా ముసుగు కట్టుకుని బయటకు వెళ్లే బదులు ఆవు మాస్క్ వేసుకుని వెళితేనే మంచిదని విమర్శనాత్మకంగా చెప్పిన ఈ ఫొటోషూట్ పెద్ద చర్చనే లేవదీస్తోంది. సామాజిక మాధ్యమాల్లో సుజాత్రో ఆలోచనను పంచుకుంటున్నారు. ఢిల్లీలోనే కాకుండా కోల్‌కతా, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో ఇలా నిరసన తెలుపుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.